# క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

హైదరాబాద్
4-10-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 194

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## కమల దళంలో నిరాశ!

**చివరి నిమిషంలో హోం మంత్రి అమిత్ షా పర్యటన రద్దు**

**ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన బిజెపి నేతలు**

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. చివరి నిమిషంలో అనివార్య కారణాలతో రద్దయినట్లు తెలుస్తోంది. షెడ్యూల్ ప్రకారం ఆయన హైదరాబాద్ చేరుకుని.. మరుసటి రోజు మెదక్, కరీంనగర్ జిల్లాల్లో పలు కీలక అభివృద్ధి,, విద్యా కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంది. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, మెదక్ ఎంపీ రఘునందన్ రావు స్వయంగా క్షేత్రస్థాయిలో



2లో

## కల్తీ.. ఆపై కుళ్లిన ఆహారం!

**టీజీ సేఫ్ బృందాల తనిఖీల్లో దిగ్భ్రాంతికర దృశ్యాలు**

**ప్రమాదంలో ప్రజారోగ్యం**

**హోటల్ లైసెన్సింగ్ విధానంలో మార్పు తెస్తేనే ప్రయోజనం**

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ వ్యాప్తంగా టీజీ సేఫ్ బృందాలు హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేపడుతున్నాయి.




## అడ్డంగా బుక్కైన ప్రకాష్ రాజ్!

తీవ్ర ఫ్రస్టేషన్లో సీనియర్ నటుడు

మీడియా ప్రతినిధుల పై తిట్ల దండకం

ఆగ్రహంతో రగిలిపోయిన వైనం

బాహటంగా నిరసన తెలిపిన జర్నలిస్టులు

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** సమకాలీన రాజకీయ అంశాలపై స్పందిస్తుంటారు నటుడు ప్రకాష్ రాజ్. అయితే ఆయన ప్రధానంగా బిజెపి విధానాలపై విరుచుకుపడుతుంటారు.



3లో




- పేరుకుపోయిన వేలకోట్ల చెల్లింపులు
- నెలల తరబడి పెండింగ్
- విసిగి వేశారిపోయిన కాంట్రాక్టర్లు, స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు
- సచివాలయం వద్ద ధర్నాలు, ఆందోళనలు

తెలంగాణ ప్రభుత్వానికి పేరుకుపోతున్న ఆర్థిక బకాయిలు సవాల్ విసురుతున్నాయి. తెలంగాణలో అధికారం చేపట్టిన నాటి నుంచి ఆర్థిక బకాయిలు రాష్ట్ర ఖజానాకు గుదిబండగా మారాయి. 2023 డిసెంబర్లో అధికారంలోకి వచ్చింది కాంగ్రెస్. అయితే గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన కాంట్రాక్టర్లు, ఉద్యోగులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెండింగ్ బిల్లుల మొత్తం 40 వేల కోట్ల రూపాయలుగా నమోదయింది.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ప్రస్తుత ప్రభుత్వం ఇందులోంచి ఎనిమిది వేల కోట్ల మేర పాత బకాయిలను క్లియర్ చేసింది. కొత్తగా వచ్చి చేరుతున్న బిల్లులు, పేరుకుపోతున్న చెల్లింపుల కారణంగా ప్రస్తుతం కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచులు తదితరులు బకాయిలే ఏకంగా 51 వేల కోట్లు రూపాయలు దాటిపోయాయి. ప్రభుత్వం దశలవారీగా నిధులు విడుదల చేస్తామని చెబుతున్నప్పటికీ.. అలా జరగడం లేదు. ఉద్యోగులు, కాంట్రాక్టర్లలో తీవ్ర అసంతృప్తి పెరుగుతోంది.

**తీవ్ర సంక్షోభం దిశగా..:** ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన చెల్లింపుల సంక్షోభం తీవ్ర రూపం దాల్చుతోంది. 2026 ఆగస్టు నాటికి ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన వారికి ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం బకాయిలు 14 వేల కోట్లకు దాటాయి.

- మిగతా 2వ పేజీలో



## దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు కన్నుమూత

### చెన్నైలో తుదిశ్వాస విడిచిన సింగీతం శ్రీనివాసరావు (94)

**ఆరు దశాబ్దాల కెరీర్‌లో తెలుగు, తమిళ, హిందీ భాషల్లో 60కి పైగా చిత్రాలకు దర్శకత్వం**

**పుష్పక విమానం, ఆదిత్య 369, మయూరి వంటి ప్రయోగాత్మక చిత్రాలతో చరిత్ర సృష్టించిన వైనం**

**94 ఏళ్ల వయసులోనూ 'సింగ్ గీతం' అనే చిత్రానికి దర్శకత్వం వహించి రికార్డు**

**ఆయన మృతికి సినీ, రాజకీయ ప్రముఖుల సంతాపం**

భారత సినీ యవనికపై తనకంటూ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్న దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు (94) శనివారం కన్నుమూశారు.

- మిగతా 2వ పేజీలో

## కాంగ్రెస్‌కు గుడ్‌బై?..

నర్సాపూర్‌లో హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు

నర్సాపూర్‌లో కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌లో చేరిక

'కాంగ్రెస్ శకం ముగిసింది' అంటూ హరీశ్ రావు వ్యాఖ్య

రోడ్ల పరిస్థితిపై ప్రభుత్వాన్ని టార్గెట్ చేసిన మాజీ మంత్రి

'ఫ్యూచర్ సిటీ కాదు.. ఫ్యూచర్ లేని సిటీ' అంటూ విమర్శలు



మెదక్, అక్టోబర్ 3: తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మాటల వేడి పెరిగింది. అధికార కాంగ్రెస్‌కు చెందిన పలువురు నేతలు ప్రతిపక్ష బీఆర్ఎస్‌లో చేరిన వేదికగా చేసుకుని మాజీ మంత్రి, బీఆర్ఎస్

2లో



## అనంత్ అంబానీ ఫిదా!

ఏపీ ప్రజల మనసు దోచుకున్న యువ పారిశ్రామికవేత్త

వినయం, వినమ్రతతో ఆకట్టుకున్న అంబానీ వారసుడు

కపటం లేని చిరునవ్వు, హృదయపూర్వక ప్రవర్తనతో అందరి మదిని దోచిన వైనం

- మిగతా 2,3వ పేజీలో



## రతనాల 'సీమ'!

**మారుతున్న రాయలసీమ రాత**

**ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో భారీ పరిశ్రమలు**

**దక్షిణ భారతదేశంలో ఇండస్ట్రియల్, అగ్రి అండ్ ఎనర్జీ హబ్ గా..**

**ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్న కూటమి ప్రభుత్వం**

3లో

రాయలసీమ పై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది కూటమి ప్రభుత్వం. భారీ తయారీ రంగ పరిశ్రమలు అక్కడ ఏర్పాటు అవుతున్నాయి. అదే సమయంలో కృష్ణా జలాలు రాయలసీమ వ్యాప్తంగా ప్రవహిస్తున్నాయి.. అందుకే రైతాంగాన్ని కూడా ప్రోత్సహించాలని భావించి.. పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆహ్వానిస్తోంది కూటమి ప్రభుత్వం. ప్రైవేటు రంగాల పెట్టుబడుల ద్వారా రాయలసీమ స్వరూపాన్ని మార్చాలన్న ఆలోచనతో ఉన్నారు సీఎం చంద్రబాబు.

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో

## ఉత్తమ్ కుమార్ రెడ్డి క్లారిటీ..

### వచ్చే ఎన్నికల్లో అక్కడి నుంచే పోటీ!

**హుజూర్‌నగర్ నుంచే పోటీ చేస్తానన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**తుంగతుర్తికి మారుతారన్న ప్రచారాన్ని కొట్టిపారేసిన మంత్రి**

**స్వగ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నంత మాత్రాన నియోజకవర్గం మారదని స్పష్టీకరణ**

**కాళేశ్వరం మరమ్మతుల ఖర్చుపైనా కీలక వ్యాఖ్యలు**

2లో

## దాయాదిని దంచేసి.. 85తో సరి

### స్వర్ణం నిలబెట్టుకున్న టీమిండియా

**మెరిసిన తిలక్, అభి ఆఖరి రోజుఐదు స్వర్ణాలు**

**అదరగొట్టిన క్రికెట్, హాకీ జట్లు ఆర్చర్ కుంకుమ్, గోల్ఫర్ ప్రణవి చరిత్ర**

**భారత్ ఖాతాలో 21 స్వర్ణాలు మొత్తం 85 పతకాలతో 4వ స్థానం ఖాయం!**

**నేడు ఆసియాడ్ ముగింపు**



## శ్రీసిటీలో బాయిలర్ పేలుడు..

5 మంది మరణం, మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు

శ్రీసిటీలో ప్రైవేట్ పరిశ్రమలో భారీ ప్రమాదం

బాయిలర్ పేలుడులో ఐదుగురు కార్మికులు మృతి

మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం ఆదేశం

# శ్రీసిటీలో బాయిలర్ పేలుడు..

(మొదటి పేజీ తరువాయి)

**తిరుపతి, అక్టోబర్ 3:** తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో శనివారం జరిగిన పారిశ్రామిక ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఔషధాల తయారీ పరిశ్రమలో వాటర్ బాయిలర్ పేలడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. ఈ ఘటనలో ఐదుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు గాయపడ్డారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. ఈ విషాద ఘటనపై స్పందించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. మృతుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు కీలక నిర్ణయం తీసుకుంది.

**బాయిలర్ పేలడంతో ఒక్కసారిగా కలకలం**

శ్రీసిటీలోని ఓ ప్రైవేట్ ఔషధ తయారీ పరిశ్రమలో శనివారం బాయిలర్ పేలింది. భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో పరిశ్రమలో ఉన్న కార్మికులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదంలో పలువురు కార్మికులు గాయపడగా.. ఐదుగురు అక్కడికక్కడే లేదా చికిత్సకు తరలించేలోపే మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఘటనతో శ్రీసిటీలో విషాద వాతావరణం నెలకొంది.

**మృతుల కుటుంబాలకు భారీ పరిహారం**

ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. ఒక్కో మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపింది. ప్రమాదంలో కుటుంబ పెద్దలను కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం కొంత మేర అండగా నిలిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

**గాయపడిన వారికి మెరుగైన వైద్యం**

పేలుడు ఘటనలో గాయపడిన వారిని అధికారులు



వెంటనే సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. వారికి అవసరమైన వైద్య చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

**సీఎం, డిప్యూటీ సీఎం దిగ్భ్రాంతి**

శ్రీసిటీ ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. బాయిలర్ పేలుడుకు అసలు కారణం ఏమిటి? పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు ఎలా ఉన్నాయి? అనే అంశాలపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది.

**ఘటనపై అధికారుల దర్యాప్తు**

ప్రమాదం జరిగిన పరిశ్రమలో అధికారులు పరిస్థితిని పరిశీలిస్తున్నారు. పేలుడుకు దారితీసిన సాంకేతిక కారణాలు, భద్రతా ఏర్పాట్లపై వివరాలు సేకరిస్తున్నారు. ఒకవైపు మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటించిన ప్రభుత్వం.. మరోవైపు గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించడంపై దృష్టి పెట్టింది. ప్రమాదానికి పూర్తి కారణాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. ఒక్కసారిగా జరిగిన బాయిలర్ పేలుడు ఐదు కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చింది. ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం ప్రకటించిన ప్రభుత్వం.. గాయపడిన వారికి వైద్యం, ప్రమాదానికి కారణాలపై దర్యాప్తుపై ఇప్పుడు దృష్టి సారించింది.

# రేవంత్ సర్కార్‌కు బిల్లుల గుదిబండ!

అందులో ప్రస్తుతం వీధుల్లో ఉన్న ఉద్యోగులకు సంబంధించిన 6,200 కోట్లు కాగా.. రిటైర్డ్ ఉద్యోగుల జిపిఎఫ్, పెన్షన్ బెనిఫిట్స్ రూపంలో మరో ఎనిమిది వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 4575 కోట్ల ఉద్యోగుల బకాయిలను విడుదల చేసినట్లు చెబుతున్నారు. కానీ ఈ ఏడాదిలోనే దాదాపు తొమ్మిది వేల మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందడంతో భారం మరింత పెరిగింది.



**కమీషన్ల దందా..**

ఒకవైపు బకాయిల చెల్లింపులు నిలిచిపోతే.. వాటిని క్లియర్ చేస్తామంటూ కొందరు మధ్యవర్తులు రంగంలోకి దిగుతున్నారు. పది శాతం వరకు కమిషన్లు డిమాండ్ చేస్తున్నారని ఆరోపణలు తెలంగాణ వ్యాప్తంగా వినిపిస్తున్నాయి. మరోవైపు స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులు పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. చిన్నచిన్న పనులు చేయించిన కాంట్రాక్టర్లకు సైతం నెలల తరబడి బిల్లులు చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో సచివాలయం వద్ద ఆందోళనలు, ధర్నాలు జరుగుతున్నాయి. వీటికి తోడు కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, తాత్కాలిక సిబ్బందికి అందించాల్సిన వేతనాల్లో వేల కోట్ల మేర బకాయిలు ఉండడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఈ వరుస ఆర్థిక సంక్షోభ పరిణామాలు ఇప్పుడు రాజకీయ, న్యాయపరమైన సవాళ్లుగా మారుతున్నాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఇది అత్యంత సంక్లిష్టమైన పరీక్షగా మారింది.

# కమల దళంలో నిరాశ!

పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. సర్వం సిద్ధం చేశారు. కానీ ఇంతలో ఢిల్లీలోని అత్యవసర అధికారిక సమీక్షలు, ఇతర పరిణామాలతో ఈ పర్యటన రద్దు చేసుకున్నారు అమిత్ షా.

**షెడ్యూల్ సైతం ఖరారు..**

తెలంగాణ పర్యటనలో భాగంగా మెదక్ జిల్లా తూప్రాన్ పరిధిలో అమూల్, సబర్ డైరీ భారీ మిల్క్ ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి.. స్థానిక పాడి రైతులతో మాట్లాడాల్సి ఉంది. అనంతరం మధ్యాహ్నం కరీంనగర్లో నాగనూరులో ఉన్న ప్రతిమ ఇనిస్టూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ రజితోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాల్సి ఉంది. సంస్థ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో పాల్గొని.. ప్రతిమ డీమ్డ్ యూనివర్సిటీ నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేయాల్సి ఉంది.

**ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు..**

కరీంనగర్లో అమిత్ షా పర్యటన కోసం బండి సంజయ్ ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశారు. గతంలో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన సమయంలో కుమారుడి వివాదం తెరపైకి రావడంతో దూరం కావాల్సి వచ్చింది బండి సంజయ్. అయితే ఈసారి అమిత్ షా పర్యటనను రెట్టింపు ఉత్సాహంతో ఏర్పాట్లు చేశారు. కానీ రద్దయింది. కాగా కరీంనగర్లో ప్రతిమ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలను నాటి కేంద్ర హోం మంత్రి ఎల్కే అద్వానీ 25 ఏళ్ల క్రితం ప్రారంభించారు. ఇప్పుడు పాతికేళ్ల తర్వాత మళ్లీ అదే హోం శాఖామంత్రి అమిత్ షా హాజరవుతారని తెలిసి అందరిలో ఒక రకమైన ఉత్సాహం కనిపించింది. కానీ చివరి నిమిషంలో పర్యటన రద్దు కావడంతో నిరాశ అలుముకుంది. పర్యటన ముగింపులో భాగంగా హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్ర బిజెపి ముఖ్య నేతలతో అమిత్ షా కీలక అంతర్గత సమీక్ష నిర్వహిస్తారని భావించారు. త్వరలో జరగనున్న గ్రేటర్ ఎన్నికలు, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పై అనుసరించాల్సిన కార్యాచరణ పై రాష్ట్ర నాయకత్వానికి ఆయన దిశ నిర్దేశం చేస్తారని భావించారు. ఇంతలోనే ఆయన పర్యటన రద్దయింది.

# దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

వృద్ధాప్య సమస్యలతో చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. ఆరు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ కెరీర్‌లో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో 60కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించి, భారతీయ సినిమా గతిని మార్చిన విలక్షణ సృష్టికర్తగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారు. సింగీతం శ్రీనివాసరావు ప్రస్థానం 'మాయాబజార్' వంటి క్లాసిక్ చిత్రానికి కె.వి. రెడ్డి వద్ద సహాయకుడిగా ప్రారంభమైంది. ఆ తర్వాత దర్శకుడిగా మారి, భారత చలనచిత్ర చరిత్రలో మర్చిపోలేని చిత్రాలను అందించారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన చిత్రాలలో ప్రయోగాలు ఒక ముఖ్యమైన భాగంగా ఉండేవి. సంభాషణలు లేని బ్లాక్ కామెడీ 'పుష్పక విమానం' (1987), భారతీయ సినిమాలో తొలి టైమ్-ట్రావెల్ సైన్స్ ఫిక్షన్ చిత్రంగా ఖ్యాతి పొందిన 'ఆదిత్య 369' (1991), సుధా చంద్రన్ జీవితం ఆధారంగా తెరకెక్కిన దస్ఫూర్తిదాయక నృత్య కావ్యం 'మయూరి' (1985) వంటివి ఆయన సృజనాత్మకతకు తార్కాణాలు. కమల్ హాసన్‌తో ఆయన తీసిన 'అపూర్వ సహోదరులు', 'మైఖేల్ మదన కామరాజన్' చిత్రాలు కూడా కమర్షియల్‌గా భారీ విజయాలు సాధించాయి. సాంకేతికత అందుబాటులో లేని రోజుల్లోనే, గ్రాఫిక్స్, సీజీఐ హంగులు లేకుండానే తన కథనంతో ప్రేక్షకులను అబ్బురపరిచిన దర్శక మేధావి సింగీతం. ఆయన ప్రతిభకు జాతీయ చలనచిత్ర పురస్కారాలు, నంది అవార్డులు, ఫిలింఫేర్ అవార్డులు ఎన్నోసార్లు వరించాయి. అద్భుతమైన విషయం ఏమిటంటే, 94 ఏళ్ల వయసులో కూడా ఆయన మళ్లీ దర్శకత్వం చేపట్టారు. వైజయంతీ మూవీస్ సమర్పణలో నాగ్ అశ్విన్ నిర్మించిన 'సింగ్ గీతం' అనే మ్యూజికల్ ఫాంటసీ చిత్రానికి ఈ ఏడాది దర్శకత్వం వహించారు. కేవలం 77 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. సింగీతం మృతి పట్ల సినీ, రాజకీయ ప్రముఖులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జూనియర్ ఎన్టీఆర్ నివాళులర్పిస్తూ, "ఆయన ఒక దార్శనికుడు. ఆదిత్య 369, పుష్పక విమానం, మయూరి వంటి ఆయన చిత్రాలు తరాలు మారినా తాజాగా అనిపిస్తాయి" అని పేర్కొన్నారు. బ్లాక్ అండ్ వైట్ 'మాయాబజార్' కాలం నుంచి 2026లో థియేటర్లలో విడుదలైన 'సింగ్ గీతం' వరకు ఆయన సినీ ప్రయాణం అసామాన్యమైనది, అజరామరమైనది.

# కాంగ్రెస్‌కు గుడ్‌బై?..

ఎమ్మెల్యే హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. సాధారణంగా ప్రతిపక్షం నుంచి అధికార పార్టీలోకి వలసలు కనిపిస్తాయని.. కానీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉండగానే అధికార పార్టీలోని నేతలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. ఇది కాంగ్రెస్ పరిస్థితికి సంకేతమని ఆయన వ్యాఖ్యానించారు.

**నర్సాపూర్‌లో కాంగ్రెస్ నేతల చేరిక**

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హరీశ్ రావు వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ చేరికలను ప్రస్తావిస్తూ హరీశ్ రావు.. సాధారణంగా అధికార పార్టీ వైపు ప్రతిపక్ష నేతలు వెళ్లడం చూస్తామని, కానీ ప్రస్తుతం అందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. ఎన్నికలకు ఇంకా రెండేళ్లు ఉండగానే కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి నేతలు వస్తున్నారని పేర్కొన్నారు.

**'కాంగ్రెస్ శకం ముగిసింది'**

ఈ సందర్భంగా హరీశ్ రావు "రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది" అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మూడేళ్లు పూర్తవుతున్నా ప్రజలకు చెప్పుకునే స్థాయిలో పనులు కనిపించడం లేదని ఆయన విమర్శించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితిని ఆయన ప్రస్తావించారు. ఉన్న రోడ్లకు గుంతలు పడినా వాటిని కనీసం మరమ్మతు చేయడం లేదని ఆరోపించారు. రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు.

**'కాంగ్రెస్‌లో ఉండటం కంటే బీఆర్ఎస్‌లోకి రావడమే మేలు'**

ప్రజల నుంచి ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమవుతోందని హరీశ్ రావు పేర్కొన్నారు. అభివృద్ధి పనుల విషయంలో ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారని అన్నారు. తమ పార్టీ నేతల మాటల్లో.. కాంగ్రెస్‌లో కొనసాగితే ప్రజల నుంచి ప్రశ్నలు ఎదుర్కోవాల్సి వస్తోందనే భావనతో కొందరు నేతలు కేసీఆర్ నాయకత్వంలో పనిచేయాలని నిర్ణయించుకుని బీఆర్ఎస్‌లో చేరుతున్నారని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. ఇవి ఆయన చేసిన రాజకీయ వ్యాఖ్యలేనని గమనించాలి.

**'ఫ్యూచర్ సిటీ కాదు.. ఫ్యూచర్ లేని సిటీ'**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెబుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపైనా హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. ఫ్యూచర్ సిటీని 'ఫ్యూచర్ లేని సిటీ'గా అభివర్ణించారు. ఇప్పటికే ప్రజలు నివసిస్తున్న ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలు, రోడ్ల సమస్యలను పరిష్కరించకుండా కొత్త ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీ రహదారులకు భారీగా నిధులు కేటాయిస్తున్నారని, మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఫ్యూచర్ సిటీపై బీఆర్ఎస్ గతంలోనూ విమర్శలు చేసింది. మే 2026లో హరీశ్ రావు అధికారంలోకి వస్తే ఫ్యూచర్ సిటీ ప్రణాళికను రద్దు చేస్తామని ప్రకటించిన విషయం కూడా ఉంది.

**తెలంగాణలో మళ్లీ వేడెక్కుతున్న రాజకీయాలు**

నర్సాపూర్‌లో జరిగిన తాజా చేరికలతో కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు మరోసారి తెరపైకి వచ్చాయి. ఇదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ కీలక నేతల నియోజకవర్గాల్లో సభలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారని తాజా నివేదికలు చెబుతున్నాయి. దీనికి ప్రతిగా బీఆర్ఎస్ కూడా రేవంత్ ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌లో సభ నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అంటే.. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ తెలంగాణలో ప్రధాన పార్టీల మధ్య రాజకీయ పోరు ఇప్పటి నుంచే వేడెక్కుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. నర్సాపూర్‌లో కాంగ్రెస్ నేతల బీఆర్ఎస్ చేరికను తన వాదనకు బలంగా చూపిస్తూ హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలు ఈ రాజకీయ వేడిని మరింత పెంచాయి.

# తెలంగాణలో బతుకమ్మ సందడి...

## అక్టోబర్ 10 నుంచి ఘనంగా వేడుకలు

హైదరాబాద్, అక్టోబర్ 3: పూల పండుగకు తెలంగాణ ముస్తాబవుతోంది. ఆడపడుచులు ఎంతో ప్రత్యేకంగా జరుపుకునే బతుకమ్మ సంబరాలకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. అక్టోబర్ 10 నుంచి 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. పూలతో పేర్చిన బతుకమ్మలు, మహిళల కోలాటాలు, జానపద కళారూపాలు.. ఇలా తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా ఈసారి వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించనున్నారు.

**18న ట్యాంక్‌బండ్‌పై ప్రత్యేక వేడుకలు**

బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా అక్టోబర్ 18న హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వేదికగా సద్దుల బతుకమ్మ వేడుకలను భారీ స్థాయిలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది మహిళలను భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమరవీరుల స్మారక కేంద్రం నుంచి ట్యాంక్‌బండ్ వరకు బతుకమ్మలతో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. దీంతో ఆ రోజు ట్యాంక్‌బండ్ పరిసరాలు పూల పండుగ శోభతో కళకళలాడనున్నాయి. సద్దుల బతుకమ్మ సందర్భంగా కేవలం బతుకమ్మ ఆటలకే పరిమితం కాకుండా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. వందలాది మంది కళాకారులతో జానపద, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు.

# కల్తీ.. ఆపై కుళ్లిన ఆహారం!

(మొదటి పేజీ తరువాయి)

ఆహార భద్రత, ఔషధ నియంత్రణ విభాగాలతో కలిసి ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నాయి. అయితే ఈ తనిఖీల్లో దిగ్భ్రాంతికర దృశ్యాలు వెలుగు చూస్తున్నాయి. తనిఖీ చేసిన వ్యాపార సముదాయాల్లో దాదాపు 90 శాతం చోట్ల పరిశుభ్రత లోపాలు, కుళ్లిన పదార్థాలు, నిషేధిత రసాయనాలు వాడటం వంటి తీవ్ర నిబంధనల ఉల్లంఘనలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రజారోగ్యంతో వ్యాపారులు చేస్తున్న ఈ చెలగాటాన్ని కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. అంతటితో ఆగకుండా ఆ వ్యవస్థను బాగు చేసేలా కఠిన చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

**సాధారణ ప్రక్రియగా..**

తెలంగాణ వ్యాప్తంగా ఆహార కల్తీ అనేది ఒక సర్వసాధారణంగా మారిపోయింది. ప్రజలు డబ్బులు చెల్లించి అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్నట్లు అవుతోంది. కేవలం వ్యాపార దృక్పథం మాత్రమే కనిపిస్తోంది. కనీస బాధ్యత కూడా కనిపించడం లేదు. కేవలం దరఖాస్తు చేసుకొని ఫీజు చెల్లించగానే ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతులు ఇచ్చే పద్ధతికి స్వస్తి పలకాల్సిన అవసరం ఉంది. హోటల్ ప్రారంభించడానికి ముందే కిచెన్ నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ, నిల్వ సౌకర్యాలు, వ్యర్థాల నిర్వహణ ప్రామాణికంగా ఉన్నాయో లేదో స్వయంగా పరిశీలించిన తర్వాతే లైసెన్స్ మంజూరు చేయాలి. దీనికి తోడు ప్రతి హోటల్ కు ఉపాధి, వ్యాపార స్థాయిని బట్టి హైజిన్ రేటింగ్ ఇచ్చి.. ఆ గ్రేడ్ బోర్డును హోటల్ ప్రవేశద్వారం వద్ద కస్టమర్లకు కనిపించేలా ప్రదర్శించడం తప్పనిసరి చేయాలి. ప్రజలు తాము తినే ఆహారం ఏ స్థాయి ప్రమాణాలతో ఉందో తెలుసుకునే హక్కును కల్పించినప్పుడే హోటళ్ల యాజమాన్యాల్లో ఒక రకమైన మార్పు వచ్చే ఛాన్స్ ఉంటుంది. అందుకే ఆ దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉంది.

**నిరంతర తనిఖీలు ఉంటేనే..**

ఆహార కల్తీ నియంత్రణకు సంబంధించి తనిఖీలను నిరంతరం జరిగేలా చూడాల్సిన అవసరం ఉంది. ఏడాదికి ఒక్కసారి లేదా కేవలం ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే ఆకస్మిక తనిఖీల వల్ల ఎటువంటి ఉపయోగం ఉండదు. తెలంగాణ వ్యాప్తంగా వేలాదిగా ఉన్న హోటల్ లను నిరంతరం పర్యవేక్షించడం ప్రభుత్వ అధికారుల కే సాధ్యపడదు. దీనిని నియంత్రించేందుకు ప్రభుత్వం ఆమోదించిన థర్డ్ పార్టీ ప్రైవేట్ ఆడిటింగ్ ఏజెన్సీలను సైతం రంగంలోకి దించాలి. ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రతి హోటల్ తమ ప్రాంగణంలో ఆడిట్ నిర్వహించి... ఆ నివేదికను టీజీఎఫ్ పోర్టల్ లో అప్లోడ్ చేయడం తప్పనిసరి చేయాలి.. సరుకుల లభ్యత, నిల్వ గడువు, నీటి నాణ్యతా ప్రమాణాలు క్లౌడ్ ద్వారా ఆన్లైన్ లో ట్రాక్ చేసే వ్యవస్థను అందుబాటులోకి తెస్తే పారదర్శకత పెరుగుతుంది.

**అవగాహన పెంచితేనే..**

మరోవైపు వంట పనివారు, వంట గదిలో పని చేసే కార్మికులకు ఆహార భద్రతపై సరైన పరిజ్ఞానం, అవగాహన లేకపోవడం కూడా ఆహార కల్తీ కి కారణం అవుతోంది. అసలు ఏ పదార్థాలు ఏ పరిమాణంలో వాడాలి. ఉండిన ఆహారాన్ని ఎలా నిల్వ చేయాలనే విషయాలపై చాలామందికి అవగాహన ఉండదు. ప్రభుత్వం హోటల్ యాజమాన్యాల సంఘాలకు సంబంధించి కొన్ని మార్గదర్శకాలను జారీ చేయాల్సిన అవసరం ఉంది. వంట పని వారితో పాటు కార్మికులకు విధిగా సర్టిఫికేషన్ కోర్సుల నిబంధనను పెట్టాలి. సిబ్బందికి మెడికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరి చేస్తూనే.. వారికి వ్యక్తిగత పరిశుభ్రతపై శిక్షణనివ్వడం ప్రభుత్వ ప్రాధాన్యతగా మారాలి. హోటల్ పరిశ్రమను ఒక శత్రువుగా కాకుండా.. ప్రజారోగ్యంలో భాగస్వామిగా చూడాలి. వాటిపై కఠిన నిబంధనలు తీసుకోవడం ద్వారా మూసి వేయించడం అనేది చేయకూడదు. వారికి నోటీసులు ఇచ్చి క్రమేపి వారిలో మార్పు తీసుకురావాలి.

# ఉత్తమ్ కుమార్ రెడ్డి క్లారిటీ..

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్, అక్టోబర్ 3: నియోజకవర్గాల పునర్విభజన తర్వాత మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎక్కడి నుంచి పోటీ చేస్తారనే చర్చకు ఆయన స్వయంగా తెరదించారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెడుతూ.. వచ్చే ఎన్నికల్లో తాను హుజూర్‌నగర్ నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేశారు. దీంతో తుంగతుర్తికి మారుతారన్న ఊహాగానాలకు చెక్ పడినట్లైంది.

**'వదంతులు నమ్మొద్దు'**

హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. తన నియోజకవర్గం మారుతుందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరారు. ప్రస్తుతం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్‌నగర్ నుంచే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు స్పష్టంగా చెప్పారు. డీలిమిటేషన్ తర్వాత తుంగతుర్తి నుంచి పోటీ చేసే అవకాశం ఉందంటూ కొంతకాలంగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వార్తల్లో వాస్తవం లేదని మంత్రి తేల్చిచెప్పారు.

**స్వగ్రామంలో అభివృద్ధి పనులు.. అందుకే ఆ ప్రచారం?**

తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తన స్వగ్రామం తాటిపాములలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గ్రామంలో పనులు వేగంగా జరుగుతున్నంత మాత్రాన తాను తుంగతుర్తి నుంచి పోటీ చేస్తానని భావించడం సరికాదన్నారు.



రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు తాను స్వయంగా స్పష్టత ఇవ్వడంతో.. ప్రస్తుతం ఉత్తమ్ కుమార్ రెడ్డి వచ్చే ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచే బరిలోకి దిగుతారన్న విషయం స్పష్టమైంది.

**కాళేశ్వరం ఖర్చుపైనా ఉత్తమ్ కీలక వ్యాఖ్యలు**

ఇదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణ అంశంపైనా మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించిన పనులు సాంకేతిక పరిశీలనలు, అనుమతుల ఆధారంగా ముందుకు సాగుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించిన డిజైన్లను సాంకేతికంగా పరిశీలిస్తోంది. డిజైన్‌కు సంబంధించిన లోపాల వల్ల మరమ్మతుల అవసరం ఏర్పడితే ఆ ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అయితే నిర్మాణ సంస్థల పరిధిలోకి వచ్చే లోపాలు లేదా సమస్యలు ఉంటే.. వాటిని సంబంధిత ఏజెన్సీలే తమ ఖర్చుతో సరిచేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

**నవంబర్‌లో పనులు ప్రారంభించే దిశగా..**

కాళేశ్వరం మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను నవంబర్ మధ్యలో ప్రారంభించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. సాంకేతిక అనుమతులు, టెండర్ల ప్రక్రియ పూర్తయ్యాక పనులు మొదలుకానున్నాయి. 2027 వర్షాకాలానికి ముందే పునరుద్ధరణ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం రూపొందించిన డిజైన్లను అక్టోబర్ 5న కేంద్ర జల సంఘం సాంకేతిక పర్యవేక్షణ కమిటీ పరిశీలించనుంది. నిపుణుల సూచనలు, భద్రతా ప్రమాణాల ఆధారంగా తుది నిర్ణయం తీసుకోనున్నారు. మొత్తంగా.. ఒకవైపు తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ప్రచారానికి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టత ఇవ్వగా, మరోవైపు కాళేశ్వరం పునరుద్ధరణ ఖర్చులు, బాధ్యతలపై కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. దీంతో హుజూర్‌నగర్ నుంచి తన రాజకీయ ప్రయాణం కొనసాగుతుందన్న విషయాన్ని మంత్రి స్పష్టంగా చెప్పినట్లైంది.

## దాయాదిని దంచేసి..
# 85తో సరి

ఆసియా గేమ్స్‌లో పతక పోటీల ఆఖరి రోజు భారత్ ఐదు స్వర్ణాలతో మెరిసింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను పడగొట్టి పురుషుల క్రికెట్ జట్టు.. మలేషియాను మట్టి కరిపించి హాకీ జట్టు తమ పసిడి పతకాలను నిలబెట్టుకున్నాయి. ఒలింపిక్ మెడలిస్ట్ రెజ్లర్ అమన్ సెహ్రావత్ స్వర్ణ పట్టుతో సత్తా చాటితే.. 17 ఏండ్ల యువ ఆర్చర్ కుంకుమ్ మోహోద్, గోల్ఫర్ ప్రణవి చరిత్రాత్మక స్వర్ణాలతో రికార్డు సృష్టించారు. 21 స్వర్ణాలు.. 27 రజతాలు, 37 కాంస్యాలతో 85 పతకాలు అందుకున్న భారత్ నాలుగో స్థానం దాదాపు ఖాయం చేసుకుంది. ఐదో ప్లేస్‌లో ఉన్న ఉజ్బెకిస్థాన్ చివరి రోజు ఈక్వెస్ట్రియన్ పోటీల్లో స్వర్ణం అందుకోకపోతే భారత ర్యాంకులో మార్పు ఉండదు. ఆసియాడ్ టాప్-5లో నిలవాలన్న భారత్ లక్ష్యం నెరవేరినా గత ఎడిషన్ (106) మాదిరిగా 'పతక శతకానికి' మాత్రం చాలా దూరంలో నిలిపోయింది. ఎప్పట్లానే చైనా అగ్రస్థానం అందుకుంది. ఏకంగా 169 స్వర్ణాలు సహా 341 పతకాలతో ఆసియాలో తిరుగులేని శక్తిగా కొనసాగుతోంది. ఆదివారం జరిగే ముగింపు వేడుకలతో ఆసియాడ్ మెరుపులకు తెరపడనుంది. నిషిన్ (జపాన్): టోర్నమెంట్ ఏదైనా.. పోటీ ఎక్కడైనా క్రికెట్ గ్రౌండ్‌లో పాకిస్థాన్ జట్టు ఎదురుపడితే భారత జట్టు పూనకం వచ్చినట్టు రెచ్చిపోతోంది. వరల్డ్ కప్స్, ఆసియా కప్స్‌లో దాయాదిని దంచేస్తున్న టీమిండియా ఆసియా గేమ్స్‌లోనూ పొరుగు జట్టు పని పట్టింది. ఆసియాడ్ టీ20 క్రికెట్ ఫైనల్లో పాక్‌ను పడగొట్టిన భారత్ వరుసగా రెండో స్వర్ణం అందుకుంది. స్టార్ ఓపెనర్ అభిషేక్ వర్మ (28 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సర్లతో 61), హైదరాబాదీ తిలక్ వర్మ (22 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 51 నాటౌట్) మెరుపు అర్ధ శతకాలతో విజృంభించిన వేళ శనివారం జరిగిన తుదిపోరులో 19 పరుగుల తేడాతో గెలిచిన భారత్ టైటిల్ నిలబెట్టుకుంది. ఆశించినట్టే ఉత్కంఠ రేపిన ఈ పోరులో తొలుత భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 211 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం ఛేదనలో పాక్ ఓవర్లన్నీ ఆడి 192/6 స్కోరు చేసి ఓడింది. హసన్ నవాజ్ (51 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్సర్లతో 96) పోరాడినా.. అక్షర్ పటేల్ (2/29), సుందర్ (2/29), శివం దూబే (2/33) ఆ జట్టును నిలువరించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఓపెనర్ అభిషేక్ శర్మ మెరుపు ఆరంభం ఇచ్చాడు. రెండో ఓవర్లో యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (15) రెండు సిక్సర్లు, అభి 6,4తో ఏకంగా 24 పరుగులు వచ్చాయి. మూడో ఓవర్లో వైభవ్, ఐదో ఓవర్లో శాంసన్ (2) ఔటైనా.. మరో ఎండ్‌లో అభి సిక్సర్ల వర్షం తగ్గలేదు.

# అనంత్ అంబానీ ఫిదా!




**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఎంత ఎత్తుకు ఎదిగినా కొంతమంది ఒదిగి ఉంటారు. అటువంటి వారే అంబానీ వారసుడు. ఆంధ్రుల మనసు గెలుచుకున్నాడు. వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యానికి వారసుడైన అనంత్ అంబానీ. కానీ ఆయన చూపిన వినయం, విధేయత అందర్నీ ఫిదా చేసింది. భారతీయ సంస్కారానికి ప్రతీకగా నిలిచే వినమ్రత కర్నూలు వేదికగా వెలుగు చూసింది. రాయలసీమలో జరిగిన ప్రతిష్టాత్మక రిలయన్స్ హార్టికల్చర్ యూనివర్సిటీ ప్రాజెక్టు శంకుస్థాపన సభలో రిలయన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్గా అనంత్ అంబానీ వ్యవహరించిన తీరు తెలుగు ప్రజల మనసులను గెలుచుకుంది. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తో కలిసి వేదిక పంచుకున్నారు అనంత్ అంబానీ. కార్పొరేట్ దిగ్గజంగా కాకుండా.. ఒక సామాన్యుడిగా కలిసిపోయి సభలోనే అసలైన ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వేదిక పైకి వచ్చిన క్షణం నుంచి వీడ్కోలు పలికే వరకు అనంత్ అంబానీ ప్రదర్శించిన సంస్కారం అందర్నీ ఆకట్టుకుంది.

**గొప్ప సంస్కారం..**

వినయం, విధేయత, సంస్కారం అనేది ఒకరు చెబితే వచ్చేవి కాదు. కానీ నిన్న అనంత్ అంబానీ సమస్కారం చూస్తే మాత్రం అది మనసు నుంచి వచ్చినది అనిపించింది. సీఎం చంద్రబాబు వద్దకు రాగానే అత్యంత వినయంతో చేతులు జోడించి నమస్కరించడం, సభ ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణంలో పెద్దల పట్ల ఉండే భక్తి భావంతో ఆయన పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకోవడం చూసి.. వేదికపై ఉన్న ప్రముఖులతో పాటు ప్రాంగణంలో ఉన్న వేలాదిమంది ఆశ్చర్యానికి లోనయ్యారు. అంతటి అపారమైన సంపద, ప్రపంచ స్థాయి గుర్తింపు ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ.. ఏమాత్రం దర్పం ప్రదర్శించకుండా పెద్దలను గౌరవించడం ఆయన తీరు నవతరానికి ఒక ఆదర్శమని చెప్పవచ్చు.

**రాయలసీమ పై బాధ్యత..**

నన్ను మీ ఆంధ్ర బిడ్డగా భావించండి.. వెనుకబడిన రాయలసీమ ప్రాంతాన్ని ప్రపంచస్థాయి హార్టికల్చర్ హబ్ గా తీర్చిదిద్దే బాధ్యత మా రిలయన్స్ కుటుంబానిది అంటూ ఆయన ఇచ్చిన హామీకి సభా ప్రాంగణం హర్షధ్వానాలతో హోరెత్తింది. కేవలం వ్యాపార ప్రయోజనాల కోణంలోనే కాకుండా.. ఏపీ గడ్డతో తమ కుటుంబానికి తరతరాలుగా ఉన్న ఆధ్యాత్మిక బంధాన్ని కూడా గుర్తు చేసుకున్నారు. తిరుమల శ్రీవారిపై అంబానీ కుటుంబానికి ఉన్న భక్తిని, రాష్ట్ర అభివృద్ధి యజ్ఞంలో భాగస్వామ్యం కావడం వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో దక్కిన వరం గా భావిస్తున్నట్లు అనంత్ అంబానీ ఉద్వేగంగా ప్రకటన చేశారు. తరచు తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తూ ఉంటారు అనంత్ అంబానీ. రిలయన్స్ తరుపున ఒక అధికారిక అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనడానికి రావడం ఇదే తొలిసారి. అయితే వ్యాపారవేత్తలకు ఉండే సంకుచిత పరిధులను చెరిపేస్తూ.. రాయలసీమ రైతుల కష్టాల్లో పాలుపంచుకుంటామని భరోసా ఇచ్చి అందరి మన్ననలు పొందారు. కపటం లేని చిరునవ్వు, వినయ పూర్వకమైన ప్రవర్తనతో తెలుగు ప్రజల అభిమానాన్ని సొంతం చేసుకున్నారు అనంత్ అంబానీ. అందుకే సోషల్ మీడియాలో హోరెత్తుతోంది. అంతటా అనంత్ అంబానీ చర్చ నడుస్తోంది.

## 'చుట్టమల్లే' పాట డీప్ ఫేక్ పై చిరంజీవి ఆగ్రహం.. రంగంలోకి దిగుతామని ప్రకటన

కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగించి 'చుట్టమల్లే' పాట అసభ్యకరమైన, మార్ఫింగ్ వీడియోలను సృష్టించడంపై టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి తీవ్రంగా స్పందించారు. ఇలాంటి చర్యలు క్రూరమైనవి, సిగ్గుచేటైనవి, ఏమాత్రం ఆమోదయోగ్యం కానివని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇది కేవలం ఒక వ్యక్తికి లేదా ఒక సినిమాకు సంబంధించిన సమస్య కాదని, యావత్ సమాజం దీనిపై పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఈ విషయంలో తాను చొరవ తీసుకుని, సినీ పరిశ్రమ తరఫున గట్టి చర్యలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. ఈ అంశంపై చిరంజీవి సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. "ఈ రోజు ఇది మరొకరికి జరిగింది. రేపు మీకు, నాకు లేదా మనకు తెలిసిన ఎవరికైనా జరగవచ్చు. మనకు వ్యక్తిగతంగా జరగలేదు కదా అని మౌనంగా ఉండలేం. ఈ దుర్వినియోగానికి వ్యతిరేకంగా నిలబడటం మనందరి బాధ్యత" అని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి కంటెంట్‌ను సృష్టించే వారిని, ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేసేవారిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దీన్ని ఒక జోక్‌గా కొట్టిపారేయడం సరికాదని హితవు పలికారు. ఈ సమస్య పరిష్కారానికి తాను త్వరలోనే తెలుగు ఫిల్మ్ ఛాంబర్, నిర్మాతల మండలి, ఇతర అనుబంధ సంస్థలతో మాట్లాడతానని చిరంజీవి తెలిపారు. బాధితులకు అండగా నిలిచేందుకు, సైబర్ క్రైమ్ అధికారులతో కలిసి పనిచేసేందుకు ఒక ప్రత్యేక కమిటీ, సపోర్ట్ సెల్‌ను ఏర్పాటు చేయాలని సూచించనున్నట్లు వెల్లడించారు.

# అడ్డంగా బుక్కైన ప్రకాష్ రాజ్!

(మొదటి పేజీ తరువాయి)

ఈ క్రమంలోనే తాజాగా ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియపై విమర్శలు చేస్తుంటారు. ఏకంగా ఒక ఉద్యమాన్ని ఆయన నడిపిస్తున్నారు. తాజాగా హైదరాబాద్ వేదికగా మీడియా సమావేశం నిర్వహించారు. అయితే మీడియా ప్రతినిధుల నుంచి వచ్చిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అసహనానికి గురయ్యారు. తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సినీ నటుడిగా తనకు గుర్తింపు ఉన్న దక్షిణాది రాష్ట్రాల్లో ఆయన వరుసగా పర్యటిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు ఈసీ పై ఎదురుదాడి చేస్తున్నారు. అయితే విలేకరుల సమావేశంలో మాత్రం ఆయనకు చుక్కెదురవుతోంది. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు నేరుగా సమాధానం చెప్పలేక అసహనం ప్రదర్శిస్తుండడంతో బయటపడిపోతున్నారు.

**అంతా రాజకీయ అజెండాతో**

అయితే ప్రకాష్ రాజు ఒక రాజకీయ అజెండాతో మాట్లాడుతున్నారు అనేది బహిరంగ రహస్యం. అదే ప్రణాళికతో హైదరాబాద్లో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన ఆయన తాను చెప్పాలనుకున్నది మాత్రమే చెప్పారు. ముందస్తుగా ప్లాన్ చేసుకున్న ప్రకారం మాట్లాడారు. అయితే స్థానిక మీడియా ప్రతినిధులు సర్ నిబంధనలతో పాటు సాంకేతిక అంశాలపై వివరణ కోరారు. దీంతో ఒక్కసారిగా అసహనానికి గురయ్యారు ప్రకాష్ రాజ్. ప్రజాస్వామ్యం గురించి ఉపన్యాసాలు దంచే ప్రకాష్ రాజ్ మీడియా అడిగిన సహేతుకమైన ప్రశ్నలను మాత్రం సహించుకోలేకపోయారు. స్వీకరించలేకపోయారు, విలేకరులపై ఎదురుదాడికి దిగుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విచక్షణ కోల్పోయి బిజెపి నా కొడుకులు అంటూ అత్యంత జుగుప్సాకరంగా మాట్లాడారు. బూతు పదజాలంతో విరుచుకుపడ్డారు. బాధ్యతాయుతమైన వేదికపై ఒక ప్రముఖుడి నోటి నుంచి ఇలాంటి వ్యాఖ్యలు రావడం చూసి జర్నలిస్టుల సైతం ఆశ్చర్య పోయారు.

**అప్పట్లో ఎనలేని ప్రాధాన్యం..**

ప్రారంభంలో ప్రకాష్ రాజ్ చేసే కామెంట్స్ కు మీడియాలో ఎనలేని ప్రాధాన్యం దక్కేది. ఆయన విమర్శల్లో పదును ఉండేది. సామాజిక స్పృహ అధికంగా కనిపించేది. కానీ అదంతా ఉత్తమాట అని తేలిపోయింది. కేవలం బిజెపి పట్ల వ్యతిరేక భావం కనిపిస్తోంది. వ్యవస్థల విషయంలో ఆయనకు తగినంత అవగాహన లేదని అర్థమవుతోంది. ఎన్నికల సంఘం చేపట్టిన వాటర్ల జాబితా ప్రక్షాళన పై కనీస అవగాహన లేకుండా.. కేవలం రాజకీయ లబ్ధి కోసం, ఒక నిర్దిష్ట పార్టీపై బురద జల్లడమే ధ్యేయంగా ఆయన వ్యవహరిస్తున్నారన్న భావన వ్యక్తం అవుతోంది. తన అజెండాను ప్రశ్నించే హక్కు మీడియాకు లేదన్నట్లుగా ఆయన ప్రవర్తించిన తీరు, చూపిన ఫ్రస్టేషన్ పై ఇప్పుడు చర్చ నడుస్తోంది. ప్రకాష్ రాజ్ మీడియా సమావేశం నిర్వహించిన ప్రాంతం వెలుపల తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. రాజకీయ స్వార్థంతో రాజ్యాంగబద్ధ వ్యవస్థలను, ఎన్నికల కమిషన్ ను అప్రతిష్ట పాలు చేస్తున్నారంటూ బిజెపి కార్యకర్తలు ఆయనకు వ్యతిరేకంగా భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. గో బ్యాక్ ప్రకాష్ రాజ్ అంటూ ప్ల కార్డులతో నిరసన తెలిపారు అంటే పరిస్థితి ఎంత దాకా వచ్చిందో అర్థం అవుతుంది.

# రతనాల 'సీమ'!

తీవ్ర వర్షాభావం, వలసలు, వెనుకబాటు తనానికి చిరునామా గా ఉంది రాయలసీమ ప్రాంతం. కానీ కూటమి వచ్చిన తర్వాత ఊహించని పారిశ్రామిక విప్లవానికి వేదికగా మారుతుంది. కూటమి అధికారం చేపట్టిన తర్వాత రాయలసీమ ముఖచిత్రాన్ని శాశ్వతంగా మార్చే లక్ష్యంతో అడుగులు వేశారు. భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులతో పాటు బహుళ జాతి ప్రైవేట్ దిగ్గజాల పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో కరువు సీమ కాస్త దక్షిణ భారతదేశంలోనే అత్యంత కీలకమైన ఇండస్ట్రియల్, అగ్రి అండ్ ఎనర్జీ హబ్ గా మారుతోంది.

**కరువు సీమ అపవాదు నుంచి..**

రాయలసీమ అంటేనే కరువు సీమ అనే అపవాదు ఉంది. దానిని రూపు మాపేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. వ్యవసాయ రంగాన్ని ఆధునికరిస్తూ రైతుల్లో సంపద సృష్టించేందుకు మదనపల్లి కేంద్రంగా లక్ష కోట్ల ప్రతిపాదితవ్యయంతో రాయలసీమ హార్టికల్చర్ హబ్ కు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పూర్వోదయ పథకం ద్వారా 40 వేల కోట్ల ప్రభుత్వ నిధులు, 60 వేల కోట్ల పిపిపి పెట్టుబడులతో ఉమ్మడి రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు, ప్రకాశం ప్రాంతాల్లో ఉద్యాన పంటల ప్రాసెసింగ్, ఎగుమతుల నెట్వర్క్ రూపుదిద్దుకుంటుంది. దీనికి అనుబంధంగా రిలయన్స్ సంస్థ భాగస్వామ్యంతో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ద్వారా అత్యాధునిక ఏఐ సాంకేతికత, డిజిటల్ ఫార్మింగ్ నేరుగా రాయలసీమ రైతుల పొలాల్లోకి రాబోతున్నాయి.

**భారీగా తయారీ రంగ పరిశ్రమలు..**

ముఖ్యంగా తయారీ రంగ పరిశ్రమలు కూడా రాయలసీమలో భారీగా ఏర్పాటు అవుతూ వచ్చాయి. ఆటోమొబైల్ రంగానికి సంబంధించి ప్రపంచ ప్రసిద్ధ సంస్థలు రాయలసీమను తమ వ్యూహాత్మక కేంద్రంగా ఎంచుకుంటున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పారిశ్రామిక కారిడార్ లో రాయల్ ఎన్ఫీల్డ్ సంస్థ 1500 కోట్లతో ఆటోమొబైల్ తయారీ యూనిట్ ను ఏర్పాటు చేస్తోంది. టీవీఎస్ మోటార్స్, డోంగ్ ఆహ్ వంటి సంస్థలు ఇవి కాంపోనెంట్ క్లస్టర్లను విస్తరిస్తున్నాయి. శ్రీ సిటీ, తిరుపతి ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లలో టి సి ఎల్, డిక్సన్ టెక్నాలజీ వంటి ప్రైవేటు దిగ్గజాలు వేల కోట్ల పెట్టుబడులు పెడుతున్నాయి. భారీ పరిశ్రమలు, క్లీన్ ఎనర్జీ రంగాలు సీమవైపే మొగ్గు చూపుతున్నాయి. ప్రభుత్వ వ్యూహాత్మక మద్దతు, ప్రైవేటు రంగ ప్రయోజనాలు ఏకతాటి పైకి రావడంతో రాయలసీమలో లక్షలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు దక్కుతున్నాయి. ఇది గొప్ప పరిణామం గానే చెప్పుకోవచ్చు.





# ప్రపంచ వారసత్వ రామప్ప శిల్పవైభవానికి విదేశీ ప్రతినిధుల ప్రశంసలు

## కాకతీయుల నిర్మాణ పరిజ్ఞానం అద్భుతమని కొనియాడిన బృందం





**వెంకటాపూర్ (రామప్ప), క్రైమ్ మిర్రర్, అక్టోబర్ 03:** ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ శిల్పవైభవంపై విదేశీ ప్రతినిధులు ప్రశంసల జల్లు కురిపించారు. కాకతీయుల నిర్మాణ పరిజ్ఞానం, శిల్పుల కళానైపుణ్యం అద్భుతమని కొనియాడారు. అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమంలో భాగంగా 18 దేశాలకు చెందిన 28 మంది విదేశీ అధికారులు, పాత్రికేయులతో కూడిన బృందం శనివారం ములుగు జిల్లాలోని యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని సందర్శించింది. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని భారత సాంకేతిక, ఆర్థిక సహకార కార్యక్రమం కింద హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ రెండు వారాల సామర్థ్య వికాస శిక్షణను నిర్వహిస్తోంది. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 10 వరకు జరుగుతున్న ఈ ప్రత్యేక శిక్షణలో భాగంగా ప్రతినిధుల బృందం అధ్యయన పర్యటన చేపట్టింది. అల్జీరియా, భూటాన్, కాంబోడియా, ఈక్వడార్, ఫిజీ, ఘనా, లైబీరియా, మాల్దీవులు, మారిషస్, మొజాంబిక్, సీషెల్స్, సియెర్రా లియోన్, శ్రీలంక, టోగో, ఉజ్బెకిస్తాన్, వియత్నాం, జాంబియా, జింబాబ్వే దేశాలకు చెందిన అధికారులు, పాత్రికేయులు ఈ బృందంలో ఉన్నారు. రామప్ప దేవాలయ సందర్శన సందర్భంగా ఆలయ విశిష్టత, ప్రపంచ వారసత్వ గుర్తింపు ప్రాధాన్యం, శిల్పుల నైపుణ్యం, నిర్మాణ పద్ధతులను టూరిజం గైడ్ గోరంటల విజయ్ కుమార్ విదేశీ ప్రతినిధులకు వివరించారు. భూకంపాలను తట్టుకునేలా ఇసుక పునాది సాంకేతికతను వినియోగించడం, ఆలయ గోపుర నిర్మాణంలో బరువును తగ్గించేందుకు నీటిపై తేలే తేలికపాటి ఇటుకలను ఉపయోగించడం వంటి కాకతీయుల నిర్మాణ పరిజ్ఞానం బృంద సభ్యులను ఆశ్చర్యానికి గురిచేసింది. నల్లరాతిపై సున్నితమైన నగిషీలతో చెక్కిన నిలువెత్తు శిల్పాలను, నాట్య భంగిమలతో కూడిన శిల్పాలను ఆసక్తిగా తిలకించారు. సూది బెజ్జం దూరేంత సన్నని రంధ్రాలు కలిగిన శిల్పకళను ఆసక్తిగా తిలకించారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు వెలుగు మారినా గర్భగుడిలోని శివలింగంపై ఒకే విధంగా వెలుగు పడేలా చేసిన కాకతీయుల ఖగోళ, వాస్తు నైపుణ్యాన్ని కొనియాడారు. ప్రతి శిల్పం ఆనాటి శిల్పుల ప్రతిభను, భారతీయ సంస్కృతి వైభవాన్ని భావితరాలకు చాటిచెప్పేలా ఉందని ప్రశంసించారు. కాకతీయుల సాంకేతిక పరిజ్ఞానం, నిర్మాణ శైలి, కళానైపుణ్యం అద్భుతమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పర్యటన సమన్వయ అధికారి, జిల్లా పౌర సంబంధాల అధికారి రఫిక్, పర్యాటక సమన్వయ అధికారి ధర్మా నాయక్, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర కుసుమ సూర్య కిరణ్, సంబంధిత అధికారులు, టూరీస్ట్ పోలిస్ లు తదితరులు పాల్గొన్నారు.



## చిట్యాల పీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ

### రికార్డుల నిర్వహణ, టీకాల కార్యక్రమంపై అధికారుల పరిశీలన

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డి ఎండ హెచ్ ఓ) డాక్టర్ రాహుల్ ఆకస్మికంగా చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగేష్, హెచ్‌ఈఈఓ అంజయ్య గౌడ్‌తో కలిసి చిట్యాల పీహెచ్‌సీతో పాటు వనిపాకల గ్రామంలోని సబ్ సెంటర్‌ను సందర్శించారు.అనంతరం శివనేని గూడెం అవుట్‌రీచ్ సెషన్‌ను పరిశీలించి, అక్కడ నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, రిజిస్టర్లను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని, టీకాల కార్యక్రమానికి సంబంధించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సిబ్బందికి అధికారులు సూచించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



**నూతనకల్ (క్రైమ్ మిర్రర్):** పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆపన్నహస్తంగా నిలిచే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్ట మల్లారెడ్డి శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందిన నిరుపేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆపద సమయంలో ప్రజలకు అండగా నిలవడమే ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు గుగులోత్ కృష్ణ నాయక్ పాండవుల లింగయ్య, బొలక సైదులు యాదవ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పోలీస్ అధికారులకు ఘన సత్కారం

### ప్రజలతో సత్సంబంధాలే లక్ష్యంగా పరిచయ వేదిక కార్యక్రమం



**బాలానగర్, అక్టోబర్ 03 (క్రైమ్ మిర్రర్) :** సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధి నుంచి బాలానగర్ డివిజన్ పరిధిలోకి వచ్చిన నేపథ్యంలో పోలీసు అధికారులకు స్వాగతం పలుకుతూ జింకలవాడ సామాజిక భవనంలో పరిచయ వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ నగర్ ఏసీపీ, బాలానగర్ డివిజన్ ఏసీపీ నరేష్ రెడ్డి, బాలానగర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ స్వామి గౌడ్‌లను స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అధికారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాలు కప్పి సత్కరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోలీసు శాఖ ప్రజలకు మరింత చేరువ కావడానికి, ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి ఇటువంటి పరిచయ వేదికలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. పోలీసు అధికారులు, ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాల మధ్య సమన్వయం పెంపొందించడం ద్వారా శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు మరింత కృషి చేయవచ్చని అన్నారు. బాలానగర్ డివిజన్ పరిధిలో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా పోలీసు అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భరత్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో పాటు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు తూము ఎల్లారావు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు అశోక్ ముదిరాజ్, శ్రీనివాస్, వెంకటేష్ యాదవ్, సుధాకర్ రెడ్డి, కన్నయ్య, రాజు, పెద్ద రామ్ రెడ్డి తదితరులు పాల్గొని పోలీసు అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# 100 పడకల ఆసుపత్రిగా కోదాడకు కొత్త రూపు

### రూ.26 కోట్లతో అభివృద్ధి పనులు.. నూతన ఇన్‌పేషెంట్ విభాగం ప్రారంభం

### ప్రజలకు నాణ్యమైన వైద్యమే ధ్యేయం: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్





కోదాడ అక్టోబర్ 03 క్రైమ్ మిర్రర్ : కోదాడ నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన, మెరుగైన ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. శనివారం కోదాడలోని ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా నిర్మించిన ఇన్‌పేషెంట్ విభాగాన్ని స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, జిల్లా ఎస్పీ నరసింహలతో కలిసి కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు.

**రూ. 26 కోట్లతో 100 పడకల స్థాయికి పెంపు**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా 30 పడకలుగా ఉన్న కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశామని వెల్లడించారు. దీనికోసం ప్రభుత్వం రూ. 26 కోట్లు మంజూరు చేసిందని, నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఆసుపత్రి పునరుద్ధరణ పనులతో పాటు నూతనంగా నిర్మించిన ఎగ్జిస్టింగ్ బ్లాక్, ఇన్‌పేషెంట్ విభాగాలు పూర్తికావడంతో వెంటనే ప్రజల వినియోగార్థం అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు.

**అన్ని రకాల సేవలు పునఃప్రారంభం**

శనివారం నుంచే ఆసుపత్రిలో అన్ని రకాల ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినందున కోదాడతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు, రోగులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికీ మెరుగైన, నాణ్యమైన వైద్య సహాయం అందించి బాధ్యతాయుతంగా సేవలు అందించాలని వైద్యాధికారులకు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ, లక్ష్మారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పెండెం వెంకటరమణ, డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దశరథ, డాక్టర్ సుబ్బారావు, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఇతర వైద్యులు, ప్రజా ప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 03: పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రీతిక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ అందించనున్నట్లు ఎస్పీ తెలిపారు.

**సంగారెడ్డి, జహీరాబాద్, అందోల్ కేంద్రాల్లో శిక్షణ**

అక్టోబర్ 10, 2026 నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌తో పాటు అనుభవజ్ఞులైన బోధనా సిబ్బందిచే పోటీ పరీక్షలకు సంబంధించిన అంశాలపై శిక్షణ అందిస్తారు. శారీరక దారుఢ్య పరీక్షలకు సిద్ధం కావడానికి ఫిజికల్ ట్రైనింగ్ కూడా నిర్వహించనున్నారు.

**అక్టోబర్ 7 వరకు దరఖాస్తులకు అవకాశం**

అర్హత కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 3 నుంచి 7, 2026 వరకు సమీప పోలీస్ స్టేషన్లలో దరఖాస్తు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. పోలీసు ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో శిక్షణ పొంది ఉద్యోగాల సాధనకు కృషి చేయాలని ఆయన కోరారు.

## సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ సభ కార్యక్రమం

### ముఖ్యఅతిథిగా హాజరైన భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



కూకట్ పల్లి, అక్టోబర్ 03 (క్రైమ్ మిర్రర్): అక్టోబర్ 03, 2026 సంవత్సరం సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ ఆధ్వర్యంలో నాంపల్లి, హైద్రాబాద్ లో జరిగిన ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ సభకు భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్యఅతిథిగా హాజరైనారు. చిత్రలేఖన విభాగంలో ఎంపికైన కూరెళ్ళ శ్రీనివాస్ ని రూ. 30,116/-ల పారితోషికం తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన కవులు కళాకారులను తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ లలోని 12 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెలుదండ నిత్యానంద రావు అధ్యక్షత వహించారు. నల్లగొండకు చెందిన కూరెళ్ల శ్రీనివాస్, (విశ్రాంత ప్రధానోపాధ్యాయులు) చిత్రకళా రంగంలో చేసిన సేవలకు గాను ఈ పురస్కారం వరించింది. రాష్ట్ర ప్రభుత్వ పాఠ్యపుస్తకాలకు మరియు అనేక సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు, వయోజన విద్య కార్యక్రమాలకు గీసిన చిత్రాలకు,పాఠశాలలో చేసిన కృషికి గాను ప్రతిభా పురస్కారం అందుకున్నారు.

## తెలంగాణ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదు

### అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటర్ నమోదు చేసుకోవాలి...ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

**కూకట్ పల్లి, అక్టోబర్ 03 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, మోతీనగర్ లో జనసేన నాయకులు ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు కార్యక్రమాన్ని జనసేన పార్టీ జాయినింగ్స్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ ముఖ్యఅతిథిగా హాజర్యే కార్యక్రమానికి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమకుమార్ మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అర్హత కలిగిన ప్రతి ఒక్కరు తమ ఓటర్ నమోదు చేసుకోవాలని అందుకు సంబంధిత వివరాలపై అవసరమైన సమాచారాన్ని జనసైనికుల నుండి పొందవచ్చు అని అన్నారు. మోతీనగర్ పరిసర ప్రాంతాల గ్రాడ్యుయేట్లు అందరూ కార్యక్రమానికి విచ్చేసి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కొల్లా శంకర్, బడే విశ్వేశ్వరరావు, ప్రభు చైతన్య అరేటి, మిరియాల చిట్టిబాబు, మత్తి శ్రీనివాసరావు, జనసేన కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.



# అడ్వకేట్ హుస్సేన్‌కు ఘన సన్మానం





అభినందించిన టిపిసిసి అధ్యక్షులు బండి రమేష్

**కూకట్‌పల్లి, అక్టోబర్ 03 (క్రైమ్ మిర్రర్) :** తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా వక్ఫ్ పరిరక్షణ, సమన్వయ కమిటీ సభ్యుడిగా అడ్వకేట్ హుస్సేన్ నియమితులైన సందర్భంగా, కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట్‌లోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో అభినందన, సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ హాజరై, అడ్వకేట్ హుస్సేన్‌ను ఘనంగా సన్మానించి, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, సంబంధిత అంశాల సమన్వయంలో అడ్వకేట్ హుస్సేన్ తన బాధ్యతలను చట్టపరమైన పరిధిలో నిజాయితీ, నిబద్ధత, పారదర్శకతతో నిర్వర్తించాలని ఆకాంక్షించారు. ఆయనకు ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ మంచి పేరు తీసుకురావాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పారెడ్డి, బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ముస్లిం మైనారిటీ నాయకులు, మసీదు ముస్లిం కమిటీల ప్రతినిధులు, న్యాయవాదులు, వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని అడ్వకేట్ హుస్సేన్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అడ్వకేట్ హుస్సేన్ మాట్లాడుతూ, తనను ఈ బాధ్యతకు ఎంపిక చేసిన తెలంగాణ ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, న్యాయవాదులు, కమ్యూనిటీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను చట్టపరమైన పరిధిలో నిజాయితీగా, అంకితభావంతో, పారదర్శకంగా నిర్వహిస్తానని తెలిపారు. అడ్వకేట్ హుస్సేన్‌కు నూతన బాధ్యతల్లో విజయం చేకూరాలని కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రముఖులు ఆకాంక్షించారు.



## న్యూ సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో జీవశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఘనంగా సెమినార్

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 03 (క్రైమ్ మిర్రర్):** న్యూ సిద్ధార్థ డిగ్రీ కళాశాల జీవశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "తరగతి గదికి అతీతంగా జీవశాస్త్రం: ఆధునిక పరికరాలు, అభివృద్ధి చెందుతున్న ధోరణులు ఌ ఉద్యోగ అవకాశాలు" అనే అంశంపై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించబడింది. ఉదయం 10:15 గంటలకు విద్యార్థులకు స్వాగతంతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం ఆధునిక ప్రయోగశాల పరికరాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించి, జీవశాస్త్ర రంగంలో ఉపయోగించే సాంకేతిక పరికరాల గురించి విద్యార్థులకు వివరించారు. తరువాత కళాశాల ప్రయోగశాలలను సందర్శించే అవకాశం కల్పించి, పరికరాల వినియోగాన్ని ప్రత్యక్షంగా చూపించారు. విరామం అనంతరం జీవశాస్త్రంలో ఉన్నత విద్య, పరిశోధన, ఉద్యోగ అవకాశాలపై నిపుణులు విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. అలాగే పోటీ పరీక్షలపై అవగాహన కల్పించి, భవిష్యత్తు కెరీర్‌కు సంబంధించిన సూచనలు అందించారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకోగా, పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుని ప్రస్తుత విద్యార్థులను ప్రోత్సహించారు. చివరగా అతిథుల సన్మానం మరియు ముగింపు ప్రసంగంతో సెమినార్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, అతిథులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జీవశాస్త్ర రంగంలో ఆధునిక సాంకేతికత, పరిశోధన అవకాశాలు మరియు ఉపాధి మార్గాలపై విద్యార్థులకు ఈ సెమినార్ ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.



## సింగరేణి యాజమాన్యంతో 24 ఒప్పందాలు:ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య

**మందమర్రి టౌన్ అక్టోబర్ 03 క్రైమ్ మిర్రర్:** స్థానిక జిఎం కార్యాలయంలో మందమర్రి ఏరియా చర్చల ప్రతినిధి సివి రమణ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన ద్వారా సమావేశంలో ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు,శాశ్వత వేజ్ బోర్డ్ సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య హాజరై సింగరేణి యాజమాన్యంతో మెరుగైన ఒప్పందాలు చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడు జరగనంతగా సింగరేణి యాజమాన్యంతో 24 ఒప్పందాలు చేసుకున్నట్లు వారు తెలిపారు. కొన్ని యూనియన్లు మాపై లేనిపోని ఆరోపణలు చేస్తూ ఉన్నాయని మండిపడ్డారు. తమ ఒప్పందాలు నిజం కాదని మిగతా యూనియన్లు నిరూపించేందుకు సిద్ధమేనా అని అన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళ కార్మికుల తమ సమస్యలను సీతారామయ్య దృష్టికి తీసుకువచ్చారు. అన్ని సమస్యలను పరిష్కరించేందుకు తమ యూనియన్స్ సిద్ధంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి అక్బర్ అలీ,శైలేంద్ర సత్యనారాయణ,దాగం మల్లేష్,సృజన,గీతిక, జ్యోతి,అనుష,జలది, కంది శ్రీనివాస్, వెంకటేశ్వర్లు,బాలయ్య, గాండ్ల సంపత్,శ్రీనివాస్, పారుపల్లి సంజీవ్,బింగి సత్యనారాయణ, శ్రీనివాస్,తాజుద్దీన్,లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పోషణ మాసం

## 27వ వార్డులో చిన్న పిల్లలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు



**పెరుగుదల లోపాలున్న వారికి మాతా శిశు సంరక్షణ కేంద్రానికి సంప్రదింపులు....!**

**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్)** జాతీయ పోషణ మాసంలో భాగంగా సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకం (ఐసీడీఎస్) జగిత్యాల పట్టణ పరిధిలోని 2--వ విభాగం, 27వ వార్డులో ప్రత్యేక ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక వార్డు ప్రతినిధి జుంబర్తి గంగా లక్ష్మి రాజ్ కుమార్ అధ్యక్షతన, అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు మమత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అభివృద్ధి మైలురాళ్ల పరిశీలన: 3 నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలను ప్రత్యేక పరిశీలన ద్వారా తనిఖీ చేసి, వారి శారీరక, మానసిక ఎదుగుదలలో ఆలస్యాలు లేదా లోపాలను గుర్తించారు. వైద్య పరీక్షలు మరియు సంప్రదింపులు: రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం వైద్యులు డాక్టర్ బి. సురేంద్ర కుమార్ పిల్లలకు అవసరమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఎదుగుదల లోపాలు ఉన్న పిల్లలకు మెరుగైన వైద్య సేవల కోసం మాతా శిశు సంరక్షణ కేంద్రానికి (ఎమ్‌సీహెచ్) వెళ్లాల్సిందిగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

**పౌష్టికాహార ప్రదర్శన:** రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, తృణధాన్యాలు, పాలు, గుడ్లు, క్యారెట్, బీట్‌రూట్ వంటి బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా గర్భిణులు, బాలింతలు మరియు తల్లులకు వివరించారు.

**పరిసరాల పరిశుభ్రత:** వ్యాధుల నివారణకు పరిసరాల పరిశుభ్రత అత్యంత కీలకమని తల్లులకు స్పష్టం చేశారు.

**అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలి:** ఈ సందర్భంగా వార్డు ప్రతినిధి జుంబర్తి గంగా లక్ష్మి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే 'ఆరోగ్యలక్ష్మి', 'బాలామృతం', పాఠశాల పూర్వ విద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లలకు వేళకు టీకాలు వేయించాలని, గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం, బాలల సహాయ వాణి (1098), దత్తత విభాగం మరియు మహిళా రక్షణ బృందం (షీ టీమ్) ప్రతినిధులు పాల్గొని వారి శాఖల ద్వారా అందుతున్న సేవలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ జంబర్తి గంగ లక్ష్మి రాజ్ కుమార్, పర్యవేక్షకురాలు మమత, వైద్యులు బి. సురేంద్ర కుమార్, ఔషధ నియంత్రణాధికారి బి. అర్చన, సహాయ నిలయ వైద్యురాలు (ఏఎన్‌ఎమ్) బి. శ్రీలత, వార్డు సభ్యులు స్వప్న, హేమ, గౌతమి, పూజిత, అధికారి నాగరాజు, ఆర్పీ రజిత, సహాయ నిలయ వైద్యురాలు రాధ, ఆశా కార్యకర్త శ్రీవాణి, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు శ్రీలతలతో పాటు గర్భవతులు, బాలింతలు, చిన్నారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా డా. లింగం యాదవ్‌కు అవకాశం కల్పించాలి: గోలి నరేష్




**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గోలి నరేష్ మాట్లాడుతూ.. రాబోయే గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వెలిమినేడు గ్రామానికి చెందిన బీసీ సామాజిక వర్గ ప్రముఖుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. లింగం యాదవ్‌కు అవకాశం కల్పించాలని కోరారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ పూర్తి చేసిన డా. లింగం యాదవ్, తెలంగాణ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో రూపకల్పనలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. రోహిత్ వేముల ఉద్యమంలో చురుకుగా పాల్గొని, రాహుల్ గాంధీని రెండుసార్లు తీసుకువచ్చి ఉద్యమాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో కృషి చేశారని పేర్కొన్నారు. జేఎన్‌యూ ఇన్‌చార్జిగా, ఎన్ఎస్‌యూఐ నేషనల్ కోఆర్డినేటర్‌గా సేవలందించడంతో పాటు ప్రస్తుతం టీపీసీసీ అధికార ప్రతినిధిగా, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారని తెలిపారు. విద్యావేత్తగా, యువజన నాయకుడిగా, సామాజిక ఉద్యమాల్లో చురుకైన వ్యక్తిగా పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595


# బాబుల్ రెడ్డి నగర్ లో అంగన్‌వాడీ టీచర్లకు ఘన సన్మానం

**సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా 'అంగన్ క మిలన్' కార్యక్రమం**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా 'అంగన్ క మిలన్' కార్యక్రమాన్ని కాటేదాన్ డివిజన్ బాబుల్‌రెడ్డినగర్‌లో మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలందిస్తున్న టీచర్లను ఘనంగా సన్మానించారు. అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులు, మహిళల సంక్షేమం కోసం అందిస్తున్న సేవలను గుర్తిస్తూ వారికి శాలువాలు, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మైలార్ దేవ్ పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు సమాజంలో కీలకమైన సేవలు అందిస్తున్నారని, చిన్నారుల పోషణ, విద్య, మహిళల సంక్షేమంలో వారి పాత్ర ప్రశంసనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు గోద పాండు యాదవ్, జిల్లా ఐటీ సెల్ నాయకులు వెంకటరమణ గుప్తా, జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీకాంత్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు రావుల భాస్కర్, నవారు మురళీధర్ రెడ్డి, సంతోష్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, గోపాల్ నాయక్, రమేష్ రెడ్డి, కురుమయ్య, రాజు స్వామి, రాంబాబు, కిషన్ నాయక్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉడుత లక్ష్మి, అంజమ్మ, నాగమణి, లత, ప్రభావతి, అండాలు తదితర మహిళా నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, బీజేపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్లను సన్మానించి వారికి కృతజ్ఞతలు తెలిపిన అనంతరం కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు.

# స్వాన్ లేక్ అలుగు సమస్య పరిష్కారంలో బండి రమేష్ కృషి అనిర్వచనీయం

## స్వాన్ లేక్ అపార్ట్మెంట్ సభ్యులు, కూకట్ పల్లి నియోజకవర్గ ప్రజలు

## కూకట్ పల్లి ప్రజా సమస్యల పరిష్కారంలో బండి రమేష్ ముందడుగు

## ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమస్య పరిష్కార దశలో వచ్చి క్రెడిట్ తీసుకోవడం సరికాదు: గాదె శివ



**కూకట్ పల్లి, అక్టోబర్ 03 (క్రైమ్ మిర్రర్) :** స్వాన్ లేక్ అపార్ట్మెంట్‌కు సంబంధించిన నాలా, అలుగు సమస్య పరిష్కార దిశగా చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో, ఈ సమస్యపై గత కొంతకాలంగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ కృషి అనిర్వచనీయం అని, కూకట్ పల్లి నియోజకవర్గ చెరువుల సుందరీకరణ మాత్రమే కాదు, గత కబ్జాలను కూడా విడిపించిన ఘనత మన చైర్మన్ బండి రమేష్ కి చెందుతుంది అని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గాదె శివ కూకట్ పల్లి ప్రజానీకానికి తెలియజేశారు. స్వాన్ లేక్ అపార్ట్మెంట్ అసోసియేషన్ సభ్యులు, ప్రజలతో,అపార్ట్మెంట్ సభ్యులతో పలుమార్లు మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, సంబంధిత అధికారులతో చర్చించి నాలా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు బండి రమేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నిరంతరం కృషి చేశారని గాదె శివ తెలిపారు. నాలా విస్తరణకు అవసరమైన చర్యలు చేపట్టేలా అధికారులతో సమన్వయం చేసి, సమస్య పరిష్కారానికి మార్గం సుగమం చేశారని, ప్రస్తుతం అధికారుల పర్యవేక్షణలో సంబంధిత పనులు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అయితే సమస్య పరిష్కార దశకు చేరుకున్న సమయంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆ ప్రాంతాన్ని పరిశీలించి, సమస్య పరిష్కారమవుతోందని ప్రకటించడం పట్ల తమ అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తున్నామని గాదె శివ అన్నారు. ప్రజా సమస్య పరిష్కారానికి ఎవరు ఎంత కష్టపడ్డారో, వారి కృషికి తగిన గుర్తింపు ఉండాలి. గతంలో ఎమ్మెల్యే చేసిన పనులకు ఆయనకు క్రెడిట్ ఉండాలి. అదే విధంగా, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ తరఫున బండి రమేష్ ప్రజలతో మమేకమై, అధికారులతో సమన్వయం చేస్తూ పరిష్కారానికి కృషి చేసిన సమస్యలకు కూడా ఆ కృషికి తగిన గుర్తింపు ఉండాలి" అని గాదె శివ స్పష్టం చేశారు.గతంలో ఎన్నో సంవత్సరాలుగా....గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పరిష్కారం కాని సమస్యపై స్వాన్ లేక్ అపార్ట్మెంట్ సభ్యులు చేసిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని, వారితో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ సమస్య పరిష్కారానికి బండి రమేష్ చేసిన కృషిని అపార్ట్మెంట్ సభ్యులు కూడా అభినందిస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యలపై కేవలం ప్రకటనలు చేయడం కాకుండా, ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని, సంబంధిత అధికారులతో మాట్లాడి, పరిష్కారం వచ్చే వరకు నిరంతరం కృషి చేయడం ప్రజా నాయకత్వానికి నిదర్శనమని ఆయన అన్నారు. ఇలాంటి ప్రజా సమస్యల విషయంలో భవిష్యత్తులో ఎవరు కృషి చేశారో వారికి తగిన గుర్తింపు ఉండేలా రాజకీయ పక్షాలన్నీ వ్యవహరించాలని, ప్రజా సమస్యలను రాజకీయ క్రెడిట్ కోసం కాకుండా ప్రజల ప్రయోజనం కోసం పరిష్కరించాలని గాదె శివ విజ్ఞప్తి చేశారు.స్వాన్ లేక్ అపార్ట్మెంట్ నాలా సమస్య పరిష్కారానికి అలుపెరగని కృషి చేసిన బండి రమేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ప్రజలతో మమేకమై, వారి సమస్యలపై నిరంతరం పోరాడుతున్న నాయకుల కృషిని ప్రజలే గుర్తిస్తారు.

# "కెకె కమిటీ" అంటే "కాలయాపన కమిటీ" కాకూడదు.!

### పాలిటెక్నిక్ విషయంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించాలి

### పాలిటెక్నిక్ జెఎసి రాష్ట్ర చైర్మన్, డిఎస్ఎఫ్ వ్యవస్థాపకులు ఎరవెల్లి జగన్ విజ్ఞప్తి



**కూకట్ పల్లి, అక్టోబర్ 03 (క్రైమ్ మిర్రర్) :** పాలిటెక్నిక్ వ్యవస్థను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీ పరిధిలోకి చేర్చి శక్తి శాఖలో విలీనం చేయడానికై ప్రభుత్వం జారీచేసిన జీవో 97 రద్దు చేయాలని వీరోచితంగా పోరాడిన పాలిటెక్నిక్ వ్యవస్థ భాగస్వాములతో నెలరోజుల కాలవ్యవధిలో మూడుసార్లు చర్చలు జరిపిన కే కేశవరావు నేతృత్వంలోని హైలెవల్ కమిటీ ప్రభుత్వానికి రిపోర్టు సమర్పించి రెండు వారాలు పూర్తవుతున్నా నేటికీ సవరణ జీవో జారీ కాలేదని, కనీసం ప్రభుత్వం నుండి గానీ సంబంధిత అధికారుల నుండి గానీ హై లెవల్ కమిటీ సభ్యుల నుండి గానీ పాలిటెక్నిక్ వ్యవస్థకు సంబంధించి మరలా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదని తెలంగాణ పాలిటెక్నిక్ జెఎసి రాష్ట్ర ఛైర్మన్, డిఎస్ఎఫ్ వ్యవస్థాపకులు ఎరవెల్లి జగన్ ఆవేదన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఎరవెల్లి జగన్ మాట్లాడుతూ ఇకనైనా పాలిటెక్నిక్ వ్యవస్థ భవిష్యత్ సంబంధిత విషయం పట్ల ప్రభుత్వం స్పందించి అధికారికంగా స్పష్టమైన ప్రకటనను విడుదల చేయాలని కోరారు. కేకే కమిటీ అంటే కాలయాపన కమిటీ అనే అపవాదు రాకుండా చూడాలని, హై లెవల్ కమిటీ సమర్పించిన రిపోర్టును పాలిటెక్నిక్ వ్యవస్థ భాగస్వాములకు, రాష్ట్ర ప్రజలకు బహిర్గతం చేయాలని ఎరవెల్లి జగన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.

# సింగరేణి రిటైర్డ్ కార్మికులకు కనీస పెన్షన్ పదివేల రూపాయలు ఇవ్వాలి



**మందమర్రి టౌన్ అక్టోబర్ 03 క్రైమ్ మిర్రర్:** రిటైర్డ్ సింగరేణి కార్మికులకు కనీస పెన్షన్ 10 వేల రూపాయలకు తగ్గకుండా పెంచాలని మందమర్రి డివిజన్ సింగరేణి రిటైర్ కార్మికుల అసోసియేషన్ అధ్యక్షుడు వాసాల శంకర్ ప్రభుత్వాన్ని యూనియన్ నాయకులను శుక్రవారం స్థానిక మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం 350 రూపాయల నుంచి 1,000 రూపాయల లోపు పెన్షన్ పొందుతున్న రిటైర్డ్ కార్మికులు సుమారు 20 వేల మంది ఉన్నారని తెలిపారు. వారికి కనీస పెన్షన్ 10 వేల రూపాయలకు పెంచేలా యూనియన్ నాయకులు ఒత్తిడి తీసుకురావాలని కోరారు. రాబోయే 12వ వేజ్ బోర్డు ఒప్పందంలో యూనియన్ నాయకులు ప్రతిపాదించాలని కనీసం ప్రభుత్వం చొరవ తీసుకొని చేయూత పెన్షన్ అయినా అందించాలని అన్నారు.అదేవిధంగా సొంత ఇళ్లు లేని రిటైర్డ్ కార్మికులకు సింగరేణి కాళీ కోటర్స్,250 గజాల వరకు ఖాళీ స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్మికులకు అందిస్తున్న హెల్త్ కార్డు పరిమితిని ప్రస్తుత 8 లక్షల రూపాయల నుంచి 20 లక్షల రూపాయలకు పెంచాలని అన్నారు.ఈ సమావేశంలో కార్యదర్శి నెల్లి వీరయ్య,అసోసియేషన్ కోశాధికారి ఆసం కొమురయ్య, సంయుక్త కార్యదర్శి పోల్ సంపత్, ఉపాధ్యక్షులు జక్కం రాజన్న, రాజేష్, నాయకులు ఎం.డి. ఖలీల్, సీహెచ్. గట్టయ్య, వీరయ్య, దాసరి ఎల్లారం, ఏ. మదనయ్య, ఎం. రాజలింగు, మల్లేశం, రామారావు, జి. భూమయ్య, ఎం. వీరస్వామి, పి. రాజేశం, జె. రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ సెల్ కార్యదర్శిగా సోమారపు సామెల్



**మందమర్రి టౌన్ అక్టోబర్ 03 క్రైమ్ మిర్రర్:** మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎస్సి సెల్ కార్యదర్శిగా సోమారపు సామెల్ ను శనివారం నియమించారని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి బాధ్యతను అప్పగించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.నియామకానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డా.గడ్డం వివేక్ వెంకటస్వామి,పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, టిపిసిసి ఎస్సి డిపార్ట్‌మెంట్ చైర్మన్ మానకొండూర్ శాసనసభ్యులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ పైడిమల్ల నర్సింగ్, మందమర్రి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు మంద తిరుమల్ రెడ్డి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.నాకు లభించిన పదవి ఒక హోదా కాదు ప్రజల కోసం పనిచేసే బాధ్యత అని అన్నారు.సమాజంలో అణగారిన వర్గాలకు హక్కులు సమానత్వం సామాజిక న్యాయం సంక్షేమం అందేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతను క్రమశిక్షణతో నిజాయితీతో నిబద్ధతతో నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. అణగారిన వారి ఆత్మగౌరవం కోసం, సమానత్వం కోసం, సామాజిక న్యాయం కోసం పనిచేయడమే నా లక్ష్యం అని అన్నారు.తన నియామకానికి సహకరించిన శ్రేయోభిలాషులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# అంగన్వాడీ టీచర్లకు ఘన సన్మానం

### మైలార్‌దేవ్‌పల్లి లక్ష్మిగూడ ప్రభుత్వ పాఠశాల

### బాబు రెడ్డినగర్ అంగన్వాడీ కేంద్రంలో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహిసున్నట్లు బీజేపీ నాయకులు పేర్కొంటున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవ్‌పల్లి కాటేదాన్ డివిజన్‌లలో అంగన్వాడీ టీచర్లను ఘనంగా సన్మానించారు. లక్ష్మిగూడ ప్రభుత్వ పాఠశాల, బాబుల్ రెడ్డినగర్ అంగన్వాడీ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్ల సేవలను గుర్తిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే మైలార్ దేవ్ పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి స్వర్ణలత రెడ్డి పాల్గొన్నారు. అంగన్వాడీ టీచర్లకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, చిన్నారుల సంక్షేమం కోసం అంగన్వాడీ టీచర్లు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తూ, వారికి అవసరమైన సహాయాన్ని అందించడంలో అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న కృషిని అభినందించారు. వారి సేవలను గుర్తించి సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. సమాజంలో మహిళలు, చిన్నారుల ఆరోగ్యం, పోషణ, సంక్షేమానికి అంగన్వాడీ కేంద్రాలు కీలకంగా పనిచేస్తున్నాయని, క్షేత్రస్థాయిలో అంగన్వాడీ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తున్నారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గోదా పాండు యాదవ్, మాజీ అధ్యక్షుడు అడికే జనార్దన్, రావుల భాస్కర్, సంతోష్ గౌడ్, బబ్లూ, నవారు మురళీధర్ రెడ్డి, వెంకట రమణ గుప్తా, ఎన్ను శంకర్ రెడ్డి, రమేష్ రెడ్డి, గోపాల్ నాయక్, కిషన్ నాయక్, వెంకట రమణ, అడికే శివ, కుర్మయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే డివిజన్ మహిళా మోర్చా నాయకురాలు ఉడుత లక్ష్మితో పాటు అండాలు, జయంతి, అంజమ్మ, నాగమణి, సీతామహాలక్ష్మి, సుజాత, సాయి ప్రసన్న, వసంత, వెంకటేశ్వరమ్మ, రాజేశ్వరి, సునీత, శోభారాణి, వరలక్ష్మి, రషీదా బేగం తదితరులు పాల్గొన్నారు.



# జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ఘనంగా ఆరుద్రాష్టమి వ్రతం

### 2700 మంది మహిళలతో సామూహిక వ్రతం

### వ్రత క్రతువులో పాల్గొన్న జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి

వ్రత క్రతువులో పాల్గొన్న జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 03: సంగారెడ్డి జిల్లా ఫసల్‌వాడిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో పీఠాధిపతి మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో ఆరుద్రాష్టమి వ్రత క్రతువును శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి టీపీసీసీ నాయకుడు జగ్గారెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆరుద్రాష్టమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా సుమారు 2700 మంది మహిళలతో సామూహిక ఆరుద్రాష్టమి వ్రతాన్ని నిర్వహించారు. నిర్మలా జగ్గారెడ్డి కూడా సామూహిక వ్రతంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరుద్రాష్టమి మహత్యం, అమ్మవారి విశిష్టత, వ్రత పూజా విధానాలను నిర్వాహకులు భక్తులకు వివరించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ప్రత్యేక పూజలు, వ్రత క్రతువులతో జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంగేరి శ్రీహరి, జ్యోతిర్వాస్తు విద్యాపీఠం నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి:జిఎం ఎన్.రాధాకృష్ణ

**మందమర్రి టౌన్ అక్టోబర్ 03 క్రైమ్ మిర్రర్:** పరిశుభ్రమైన పరిసరాలతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ తెలిపారు. శనివారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ ఆవరణలో 'ప్రత్యేక ప్రచారం--6'లో భాగంగా నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా జిఎం ఎన్.రాధాకృష్ణ మాట్లాడుతూ పరిశుభ్రతను ఒక కార్యక్రమానికే పరిమితం చేయకుండా నిత్యకృత్యంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.మహాత్మా గాంధీజీ కలలుగన్న స్వచ్ఛ భారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.పరిసరాల అపరిశుభ్రతతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని,దాని ప్రభావం వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు సమాజ ఆరోగ్యంపైనా ఉంటుందని తెలిపారు.ప్రతి ఒక్కరూ వారానికి కనీసం రెండు గంటలు శ్రమదానం చేస్తూ ఇల్లు,పరిసరాలు, కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిశుభ్రమైన పని వాతావరణం ఉద్యోగుల పనితీరు, ఉత్పాదకతను పెంచుతుందని పేర్కొన్నారు.సింగరేణి అధికారులు,ఉద్యోగులు,వారి కుటుంబ సభ్యులు పరిశుభ్రతను జీవన విధానంగా మార్చుకుని,రక్షణతో కూడిన ఉత్పత్తికి తోడ్పడాలని ఆకాంక్షించారు.అనంతరం అధికారులు,ఉద్యోగులతో స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో ఎస్ఓటూజీఎం జి.ఎల్.ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్




కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) సి.హెచ్.అశోక్,పర్యావరణ అధికారి కాతం వెంకట్‌రెడ్డి, సీనియర్ పీవో ఎం.కార్తీక్, ఏఐటీయూసీ జీఎం నిర్మాణ కమిటీ సభ్యుడు సి.వి.రమణ, జీఎం కార్యాలయ ఫిట్ కార్యదర్శి గీతికతో పాటు అధికారులు,ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హస్తాల వీరభద్రస్వామి ఆలయ భూముల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలి

**అక్రమ నిర్మాణాలను తొలగించి ఆలయ భూములను పరిరక్షించాలి.. పోలీస్ కమిషనర్‌కు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి**

**ఆలయ పుష్కరిణి మధ్యలో గోడ నిర్మించారంటూ నాయకుల ఆందోళన.. ఆలయ ఆస్తుల పరిరక్షణకు ఉద్యమం చేపడతామని వెల్లడి**





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** అత్తాపూర్ సర్కిల్ ఉప్పర్‌పల్లి గ్రామ పరిధిలోని చింతల్‌మెట్‌లో ఉన్న హస్తాల వీరభద్రస్వామి ఆలయానికి చెందిన సుమారు నాలుగు ఎకరాల భూమి ఆక్రమణకు గురవుతోందంటూ బీజేపీ నాయకులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, పవిత్రమైన ఆలయ పుష్కరిణి మధ్యలో గోడ నిర్మించారని ఆరోపిస్తూ తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆలయ భూముల ఆక్రమణ అంశాన్ని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, కాంటెస్ట్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్‌గౌడ్‌తో కలిసి ఎంపీ, స్థానిక నాయకులు, కార్యకర్తలు చింతల్‌మెట్‌లోని ఆలయ పరిసరాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయానికి చెందిన భూముల్లో నిర్మాణాలు చేపడుతున్నారని, ఆలయ పుష్కరిణి మధ్యలో కూడా గోడ నిర్మించారని నాయకులు ఆరోపించారు. ఆలయ ఆస్తులకు సంబంధించిన అంశంపై అధికారులు గతంలో పలుమార్లు దృష్టికి తీసుకెళ్లినా తగిన చర్యలు కనిపించడం లేదని వారు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పోలీస్ కమిషనర్ సజ్జనార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆలయ భూములపై సమగ్ర విచారణ జరిపి, రికార్డులు పరిశీలించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయ భూముల్లో చేపట్టినట్లు ఆరోపిస్తున్న అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు, ఆక్రమణ నిజమని నిర్ధారణ అయితే సంబంధిత భూములను ఆలయానికి పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆలయాల భూములు, పుష్కరిణులు ఆక్రమణలకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆలయ ఆస్తులను పరిరక్షించేందుకు అధికారులు తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. హస్తాల వీరభద్రస్వామి ఆలయాన్ని, దాని ఆస్తులను పరిరక్షించేందుకు ఎంత దూరమైనా వెళ్తామని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆలయంలో పూజా కార్యక్రమాలు, పరిశుభ్రత కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించడంతో పాటు, ఆలయ భూముల పరిరక్షణ కోసం స్థానిక యువత, భక్తులు, హిందూ బంధువులతో కలిసి కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు. ఆలయ భూముల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.తెలంగాణ దేవాదాయ శాఖ అధికారికంగా దేవాలయ సంస్థల భూములను ఆక్రమణల నుంచి రక్షించడం, రెవెన్యూ శాఖతో సమన్వయం చేయడం తన ప్రధాన విధుల్లో భాగమని పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో చింతల్‌మెట్‌లోని సదరు భూములపై సంబంధిత శాఖలు రికార్డులు, సర్వే వివరాలు పరిశీలించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా నాయకులు వై. శ్రీధర్, కొమురయ్య, బొక్క బాల్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్‌యాదవ్, దీపక్‌యాదవ్, కిట్టుగౌడ్, వంశీయాదవ్, సులిగి వెంకటేష్, అమర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సందీప్‌గౌడ్, రమణ రాజుగౌడ్, నర్సింగ్, మహేందర్‌గౌడ్, సిద్ధేశ్వర్, శ్రీకాంత్‌రెడ్డి, సందీప్ ముదిరాజ్, ఉదయ్‌కుమార్, బాబురావు, విఠల్, శ్రీను, రాజు, ఉమేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులతో పాటు బజరంగ్‌దళ్ నాయకులు, స్థానిక యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శంషాబాద్ సర్కిల్‌లో రూ.2.88 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**కొత్వాల్‌గూడ, సంఘీగూడలో స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ పరిధిలో వరద నీటి ముంపు సమస్యకు పరిష్కారం చూపే దిశగా మరో అడుగు పడింది. వార్డులు 118, 119 పరిధిలో మొత్తం రూ.2.88 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. జీహెచ్‌ఎంసీ శంషాబాద్ సర్కిల్ పరిధిలోని కొత్తగూడలో చేపట్టనున్న ఈ పనుల్లో భాగంగా వార్డు నంబర్ 118లో రాఘవేంద్ర హోటల్ నుంచి సంఘీగూడ జంక్షన్ వరకు స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మించనున్నారు. అలాగే వార్డు నంబర్ 119లో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు, బాక్స్ కల్వర్ట్ ఎదురుగా ఉన్న ప్రాంతం నుంచి కొత్వాల్‌గూడలోని ప్లాట్ నంబర్ 114 వరకు వరద నీటి కాలువను నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసిన సమయంలో వరద నీరు నిలిచిపోవడం, రహదారులపై నీరు ప్రవహించడం వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే ఉద్దేశంతో ఈ డ్రైనేజీ పనులను చేపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కొత్తగా నిర్మించనున్న స్టార్మ్ వాటర్ డ్రైన్ ద్వారా వర్షపు నీటిని సమర్థవంతంగా మళ్లించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించేందుకు అవసరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. శంకుస్థాపన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. డ్రైన్ నిర్మాణ పనులు పూర్తయితే కొత్వాల్‌గూడ, సంఘీగూడ పరిసర ప్రాంతాల్లో వర్షపు నీటి ముంపు సమస్య గణనీయంగా తగ్గే అవకాశం ఉందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# వడ్డేపల్లి, బ్రాహ్మణ గౌరారంలో భూ రీ హద్దుల గుర్తింపు

**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** నాంపల్లి మండలం పరిధిలోని వడ్డేపల్లి శివారు, బ్రాహ్మణ గౌరారం శివారులో అధికారులు భూ రీ - సర్వే నిర్వహించి హద్దులను గుర్తించారు. శనివారం చండూరు ఆర్డీవో శ్రీదేవి, నాంపల్లి మండల తహసిల్దార్ అంబటి ఆంజనేయులు సంయుక్తంగా భూమిని పరిశీలించి క్షేత్రస్థాయిలో కొలతలు చేపట్టి నూతన సరిహద్దులను గుర్తించారు. సర్వే ఆధారంగా భూమి హద్దులను ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియలో భూ వివాదాలకు ఎలాంటి విభేదాలకు తావు లేకుండా చక్కటి పరిష్కారం పరిష్కారము లభిస్తుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్.., వడ్డేపల్లి గ్రామ సర్పంచ్ జంపాల లక్ష్మీ సైదులు, ఉప సర్పంచ్ వార్డు మెంబర్లు జెట్ట బోయిన శంకర్, కడారి దనయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.



# నార్సింగిలో శ్మశాన వాటిక భూమిపై కబ్జా ఆరోపణలు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నార్సింగి పరిధిలోని శ్మశాన వాటికకు సంబంధించిన భూమిపై అక్రమ లావాదేవీలు జరుగుతున్నాయంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సర్వే నంబర్లు 304, 305లో మొత్తం 1 ఎకరం 3 గుంటల భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. శ్మశాన వాటికకు కేటాయించిన విలువైన భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో మహ్మద్, ముస్తఫా, గౌస్ అనే వ్యక్తుల పేర్లు వినిపిస్తున్నప్పటికీ, ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల నుంచి అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది. డూప్లికేట్ పత్రాలను ఉపయోగించి భూమిపై లావాదేవీలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్న నేపథ్యంలో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. కోట్ల రూపాయల విలువ చేసే శ్మశాన వాటిక భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మాజీ కౌన్సిలర్ ఉషారాణి పేర్కొన్నారు. భూమికి సంబంధించిన రికార్డులు, పాత పత్రాలు, ప్రస్తుత రిజిస్ట్రేషన్ వివరాలు, సర్వే హద్దులను సమగ్రంగా పరిశీలించాలని ఆమె రెవెన్యూ, హైడ్రా అధికారులను కోరారు. సర్వే నంబర్లు 304, 305లోని భూమి వాస్తవంగా ఎవరి ఆధీనంలో ఉంది? దానికి సంబంధించిన అధికారిక రికార్డులు ఏమిటి? భూమిపై ఏవైనా రిజిస్ట్రేషన్లు జరిగాయా? పత్రాల ప్రామాణికత ఏమిటి? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. శ్మశాన వాటికకు సంబంధించిన భూమి అయితే దానిని పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలు లేదా లావాదేవీలు జరిగితే నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని మాజీ కౌన్సిలర్ ఉషారాణి కోరారు. భూమి రికార్డులను ప్రజలకు స్పష్టంగా వెల్లడించి, వాస్తవాలను బయటపెట్టాలని స్థానికులు కూడా అధికారులను కోరుతున్నారు. అయితే భూమి కబ్జా, డూప్లికేట్ పత్రాలు, అక్రమ విక్రయాలపై వచ్చిన ఆరోపణలు అధికారిక విచారణలో నిర్ధారణ కావాల్సి ఉంది. రెవెన్యూ, హైడ్రా అధికారులు చేపట్టే పరిశీలనతో ఈ భూమికి సంబంధించిన అసలు హక్కులు, రికార్డులు, లావాదేవీలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# ఎంజిఐటిలో షాద్‌నగర్ పాలిటెక్నిక్ విద్యార్థులకు ప్రయోగశాల సందర్శన

**ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక మెంటర్--మెంటీ కార్యక్రమంలో భాగంగా అవగాహన**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక మెంటర్--మెంటీ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో షాద్‌నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులకు ప్రయోగశాల సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ సహకారంతో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా షాద్‌నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన డిప్లొమా విద్యార్థులు, అధ్యాపక ప్రతినిధులు ఎంజిఐటిలోని వివిధ ఇంజినీరింగ్ ప్రయోగశాలలను సందర్శించారు. అధునాతన సాంకేతిక పరికరాలు, ప్రయోగశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, వాటి వినియోగ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంజిఐటిలోని ఈఈఈ, ఈసీఈ విభాగాల అధ్యాపకులు ప్రయోగశాలల నిర్వహణ, ప్రాక్టికల్ శిక్షణ, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. పాఠ్యాంశాల్లో నేర్చుకున్న సాంకేతిక అంశాలను ప్రయోగాత్మకంగా అర్థం చేసుకునేందుకు ఇటువంటి ప్రయోగశాల సందర్శనలు ఉపయోగపడతాయని అధ్యాపకులు తెలిపారు. మెంటర్ సంస్థగా ఎంజిఐటి, షాద్‌నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు విద్యా, సాంకేతిక, ప్రయోగశాల అభివృద్ధి, అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి, అకడమిక్ మెంటరింగ్ తదితర అంశాల్లో సహకారం అందిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉన్నత స్థాయి సాంకేతిక వాతావరణాన్ని పరిచయం చేయడంతో పాటు, వారి ప్రాక్టికల్ నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎంజిఐటి ఈఈఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. పి. నాగశేఖర్ రెడ్డి నోడల్ అధికారిగా సమన్వయం చేశారు. ఎంజిఐటి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. చంద్ర మోహన్ రెడ్డి మార్గదర్శకత్వంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు ప్రయోగశాల సందర్శన ద్వారా పొందిన సాంకేతిక పరిజ్ఞానం తమ విద్యా, వృత్తి ప్రస్థానంలో ఉపయోగపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# అనంతగిరి ఘాట్ రోడ్డు బస్సు ప్రమాద బాధితులకు మంత్రి పరామర్శ

**క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన**

**మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా**

**రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్**





పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 02: వికారాబాద్ జిల్లా అనంతగిరి ఘాట్ రోడ్డులో జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడిన వారిని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ పరామర్శించారు. ప్రమాదంలో గాయపడిన వారిలో పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామానికి చెందిన వారు ఉన్నారని తెలుసుకున్న ఆయన ఆసుపత్రికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు భరోసా ఇచ్చారు.



# గ్రామ సర్పంచ్ భర్త గ్రామ సభలో బెదిరించినందుకు అఖిలపక్షం ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు

### గ్రామ సమస్యలు అడిగితే బెదిరింపులా..?

### గ్రామసభలో వివాదం

### ప్రాణభయం ఉందంటూ పోలీసులను ఆశ్రయించిన గ్రామస్థుడు

**క్రైమ్ మిర్రర్, సంస్థాన్ నారాయణపురం:-** యాదాద్రి భువనగిరి జిల్లా, నారాయణపురం మండలం అల్లందేవిచెర్వు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఉద్రిక్తత చోటుచేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామ సమస్యలపై ఓ సామాన్య పౌరుడు ప్రశ్నలు అడుగుతున్న సమయంలో సర్పంచ్ సమాధానం ఇవ్వకుండా సర్పంచ్ భర్త సుర్వి రాజు తనను బెదిరించినట్లు సదరు గ్రామస్థుడు ఆరోపించారు.గ్రామ సభలో గ్రామ సమస్యలను ప్రజల తరఫున ప్రశ్నిస్తూ వీడియో తీస్తున్న సమయంలో సర్పంచ్ భర్త తనను దుర్భాషలాడుతూ, వీడియో తీసుకుంటే తీసుకో, గ్రామ పౌరుడిగా ఇక్కడ కూర్చుంటా ఎందిరా, నీకు పంచాయతీ కావాలా రా, తిక్కలోనివరా" అంటూ, సభలో నుంచి వ్యక్తికి మీదికి వచ్చి బెదిరించడం జరిగిందని, నారాయణపురం మండల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదులో పేర్కొన్నట్లు గ్రామస్థులు తెలిపారు. అంతేకాకుండా తనపైకి వస్తూ బెదిరించడంతో తనకు ప్రాణభయం ఉందని సదరు పౌరుడు పేర్కొన్నట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో అల్లందేవిచెర్వు గ్రామ అఖిలపక్షం ఆధ్వర్యంలో గ్రామస్థులు నారాయణపురం మండల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సర్పంచ్ భర్త సుర్వి రాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. గ్రామసభలో జరిగిన ఘటనపై విచారణ జరిపి, తమకు రక్షణ కల్పించడంతో పాటు, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.ఘటనకు సంబంధించిన వీడియోలు, ఆధారాలను పరిశీలించి విచారణ చేపట్టాలని గ్రామస్థులు పోలీసులను కోరారు.ఈ కార్యక్రమంలో అల్లందేవిచెర్వు గ్రామ అఖిలపక్ష నాయకులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

## మహిళా సర్పంచ్‌ను దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

### ఎస్ఐ, ఎంపీడీవోలకు ఫిర్యాదు చేసిన సర్పంచ్ సుర్వి సౌజన్య రాజు గౌడ్



**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:-** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల అల్లందేవిచెరువు గ్రామపంచాయతీ సర్పంచ్ సుర్వి సౌజన్య రాజు గౌడ్ ని బహిరంగంగా అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తూ, అవమానిస్తూ, అధికారిక విధుల నిర్వహణకు ఆటంకం కలిగిస్తూ,అనుమతి లేకుండా వీడియోలు తీస్తూ వేధింపులకు పాల్పడుతున్న సుర్వి లింగస్వామిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సంస్థాన్ నారాయణపురం పోలీస్ స్టేషన్ ఎస్ఐ కి, మండల పరిషత్ అభివృద్ధి అధికారికి ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ సుర్వి సౌజన్య రాజు గౌడ్ తెలిపారు.గ్రామంలోని సర్వే నంబర్ 136లోని పాత ఊరుకు సంబంధించిన అంశంపై అధికారుల ద్వారా సర్వే నిర్వహించి, గ్రామ పాత ఊరును కాపాడాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినప్పటి నుంచి సుర్వి లింగస్వామి తనపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.గతంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద తనను అవమానించే విధంగా వ్యవహరించడంతో పాటు, గ్రామంలో వర్షపు నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన తాత్కాలిక కాలువ మార్గాన్ని పూడ్చివేసి సమస్యను సృష్టించి, అనంతరం తనపై పత్రికా ప్రకటనలు ఇచ్చినట్లు ఆమె పేర్కొన్నారు.అదేవిధంగా గతంలో నిర్వహించిన గ్రామసభలో కూడా సుర్వి లింగస్వామి అసభ్యకరమైన పదజాలంతో తనను, అధికారులను దూషించినట్లు ఆమె తెలిపారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో కూడా మద్యం సేవించి తనను బహిరంగంగా దూషిస్తూ,తన భర్త సుర్వి రాజు గౌడ్‌ను సైతం దూషిస్తూ సెల్‌ఫోన్‌లో వీడియో చిత్రీకరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఒక మహిళా ప్రజాప్రతినిధిగా గ్రామసభలు, గ్రామపంచాయతీ కార్యక్రమాల్లో విధులు నిర్వహిస్తున్న తనను పదేపదే అవమానిస్తూ, వేధించడం వల్ల తీవ్ర భయాందోళనకు గురవుతున్నానని సుర్వి సౌజన్య రాజు గౌడ్ తెలిపారు.ఈ ఘటనలపై సంస్థాన్ నారాయణపురం ఎస్ఐ , ఎంపీడీవో సమగ్రంగా విచారణ జరిపి, సంబంధిత వ్యక్తిపై వర్తించే చట్టాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# గుండెకు వైద్యం.. మనసుకు ధ్యానం

## మానసిక ప్రశాంతత, గుండె ఆరోగ్యంపై ది అన్‌చార్టెడ్ ఆర్టరీ -- హార్ట్‌ఫుల్‌నెస్ కంపాస్

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** గుండె ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, భావోద్వేగ సమతుల్యత ప్రాధాన్యతను వివరిస్తూ సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, హార్ట్‌ఫుల్‌నెస్ ట్రైనర్ డాక్టర్ ఎ. శరత్ రెడ్డి రచించిన తొలి పుస్తకం 'ది అన్‌చార్టెడ్ ఆర్టరీ -- హార్ట్‌ఫుల్‌నెస్ కంపాస్' శనివారం హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని మెడికవర్ హాస్పిటల్స్ బ్లూ ప్లానెట్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో పాఠకుల ముందుకు వచ్చింది. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని పరిచయం చేశారు. మెడికవర్ హాస్పిటల్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరికృష్ణ పాల్గొని డాక్టర్ శరత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. మెడికవర్ హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సంపత్ కుమార్ ప్రత్యేక ఆహ్వానితుడిగా పాల్గొన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ గ్లోబల్ గైడ్, పద్మభూషణ్ కమలేష్ డి. పటేల్ (దాజీ) ఈ పుస్తకాన్ని సెప్టెంబర్ 28న తెలంగాణలోని కన్హా శాంతి వనంలో ఆవిష్కరించారు. అనంతరం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పుస్తక తొలి ప్రతిని డాక్టర్ శరత్ రెడ్డి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్‌కు అందజేశారు. డాక్టర్ శరత్ రెడ్డి రాసిన వ్యాసాల ఆధారంగా రూపొందిన ఈ పుస్తకంలో మొత్తం 25 వ్యాసాలు ఉన్నాయి. వైద్య విజ్ఞానం, ధ్యాన సాధనను అనుసంధానిస్తూ ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, పని భారం, అనిశ్చితి, వేగవంతమైన జీవన పరిస్థితుల మధ్య మనసును ప్రశాంతంగా, స్థిరంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని ఇందులో వివరించారు. శారీరక హృదయ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా వ్యక్తి జీవన నాణ్యతలో కీలక పాత్ర పోషిస్తుందనే అంశాన్ని పుస్తకం ప్రధానంగా ప్రస్తావిస్తుంది. ఈ సందర్భంగా డాక్టర్ ఎ. శరత్ రెడ్డి మాట్లాడుతూ గుండె చికిత్సల్లో ప్రతి క్షణం విలువైనదే. ఆ సమయంలో చేతులు పనిచేస్తాయి.. కానీ నిర్ణయం తీసుకునేది ప్రశాంతమైన మనసే. హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానం నా ఆలోచనలో స్పష్టతను, ఒత్తిడిలోనూ నిలకడను పెంచింది. ఆ అనుభవాల నుంచే ఈ పుస్తకంలోని వ్యాసాలు పుట్టాయి. మనం శరీరంలోని



గుండె గురించి ఎక్కువగా మాట్లాడతాం. అయితే స్పష్టంగా ఆలోచించడానికి, ప్రశాంతంగా జీవించడానికి మనలోని మరో హృదయాన్ని కూడా స్థిరంగా ఉంచుకోవాలి. ఆ అంతర్గత ప్రశాంతత గురించే ఈ పుస్తకం అని తెలిపారు. నేటి జీవనశైలిలో ఒత్తిడి ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైందని ఆయన పేర్కొన్నారు. రోజుకు కొన్ని నిమిషాల ధ్యానం మనసును ప్రశాంతంగా ఉంచుకోవడానికి, నిర్ణయాలను మరింత సంయమనంతో తీసుకోవడానికి సహాయపడుతుంది. ఒక వ్యక్తి ప్రశాంతత కుటుంబానికి, పనిస్థలానికి, చివరికి సమాజానికి కూడా విస్తరిస్తుంది. అదే ఈ పుస్తకం ద్వారా నేను పంచాలనుకున్న సందేశం అని డాక్టర్ శరత్ రెడ్డి అన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ పోలీసు విధుల్లో ప్రతిరోజూ ఒత్తిడితో కూడిన పరిస్థితులు, కీలక నిర్ణయాలు ఎదురవుతాయి. అలాంటి సమయంలో మనసు ప్రశాంతంగా, ఆలోచన స్పష్టంగా ఉండటం ఎంతో అవసరం. ఒక సీనియర్ కార్డియాలజిస్ట్ తన వైద్య అనుభవాన్ని, ధ్యాన సాధనను కలిపి ఈ పుస్తకాన్ని రచించడం అభినందనీయం. ఇది సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే అంశాలను అందిస్తుంది అని అన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కృష్ణ మాట్లాడుతూ, "వైద్యం అంటే కేవలం వ్యాధికి చికిత్స అందించడం మాత్రమే కాదు.. ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించడం కూడా. గుండె ఆరోగ్యానికి మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణ ఎంత ముఖ్యమో వైద్య అనుభవంతో పాటు ధ్యాన సాధనను మిళితం చేసి ఈ పుస్తకం ద్వారా డాక్టర్ శరత్ రెడ్డి వివరించడం అభినందనీయం. వైద్య రంగంలో తన అనుభవాన్ని సమాజానికి ఉపయోగపడే సందేశంగా అందించడం మెడికవర్ కుటుంబానికి కూడా గర్వకారణం అని తెలిపారు. మెడికవర్ హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ కార్డియాలజిస్ట్‌గా తన వైద్య అనుభవాన్ని, ధ్యాన సాధన ద్వారా పొందిన అవగాహనను సులభమైన భాషలో పాఠకులకు అందించడం ద్వారా డాక్టర్ శరత్ రెడ్డి మంచి ప్రయత్నం చేశారు. గుండె జబ్బుల నివారణలో ఒత్తిడి నియంత్రణ కూడా ముఖ్యమైన అంశం. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతపై దృష్టి పెట్టేలా ఈ పుస్తకం పాఠకులకు ఉపయోగకరమైన సందేశాన్ని అందిస్తుంది అని అన్నారు. డికవర్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. వైద్య విజ్ఞానం, హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానాన్ని అనుసంధానిస్తూ డాక్టర్ శరత్ రెడ్డి రాసిన ఈ పుస్తకం ఆరోగ్యంపై సమగ్ర దృక్పథాన్ని అందిస్తుంది. వైద్యుల అనుభవాలు ప్రజలకు స్ఫూర్తినిచ్చే విధంగా పుస్తక రూపంలో రావడం మంచి పరిణామం అని పేర్కొన్నారు. డాక్టర్ ఎ. శరత్ రెడ్డి 19 ఏళ్లకు పైగా అనుభవం కలిగిన సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్. ముఖ్యంగా క్రానిక్ టోటల్ ఆక్లూజన్ వంటి సంక్లిష్ట గుండె చికిత్సల్లో ఆయనకు ప్రత్యేక అనుభవం ఉంది. అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ , అమెరికన్ హార్ట్ అసోసియేషన్ , సొసైటీ ఫర్ కార్డియోవాస్క్యులర్ యాంజియోగ్రఫీ అండ్ ఇంటర్వెన్షన్స్ , యూరోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ నుంచి ఫెలోషిప్‌లు పొందారు. సర్టిఫైడ్ హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ ట్రైనర్‌గా కూడా ఆయన సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా పుస్తక ఆవిష్కరణకు సహకరించిన మెడికవర్ హాస్పిటల్స్ బృందానికి, హార్ట్‌ఫుల్‌నెస్ గ్లోబల్ గైడ్ దాజీకి డాక్టర్ శరత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ది అన్‌చార్టెడ్ ఆర్టరీ -- హార్ట్‌ఫుల్‌నెస్ కంపాస్ పుస్తకం త్వరలో ప్రముఖ పుస్తక దుకాణాలతో పాటు అమెజాన్ వంటి ఆన్‌లైన్ వేదికల్లో అందుబాటులోకి రానుంది.

# పంచవటి కాలనీలో 'వన్ డే--వన్ వార్డ్' కార్యక్రమం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** పంచవటి కాలనీలో 'వన్ డే--వన్ వార్డ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా నార్సింగి మున్సిపల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ శ్రీధర్, డీఈ కార్తిక్, ఏఈ శ్రీనేష్తో పాటు ఇతర అధికారులు కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా పలు ప్రాంతాల్లో గ్రీన్ వేస్ట్‌ను సకాలంలో తొలగించడం లేదని, వెంటనే పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే పంచవటి కమాన్ నుంచి చికెన్ షాప్ సెంటర్ వరకు, రోడ్ నంబర్ 10 నుంచి రోడ్ నంబర్ 22 వరకు దెబ్బతిన్న రోడ్లను పునర్నిర్మించాలని, వివిధ ప్రాంతాల్లో ఉన్న గుంతలు, రోడ్ కటింగ్స్‌ను వెంటనే పూడ్చాలని విజ్ఞప్తి చేశారు. డా. సీఎన్ఆర్ ట్రీ పార్క్, శ్రీ పోతన పార్కులను అభివృద్ధి చేయాలని, ముఖ్యంగా వాకింగ్ ట్రాక్ చివరి ప్రాంతంలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. రోడ్ నంబర్ 19/21లోని పార్కు కాంపౌండ్ వాల్‌ను పునర్నిర్మించడంతో పాటు, బుల్కాపూర్ నాలా రిటైనింగ్ వాల్ వెంట వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. ఎస్ఎన్‌డిపి కింద సుమారు ?10 కోట్ల వ్యయంతో నిర్మించిన పంచవటి కాలనీ రోడ్ నంబర్ 10 నుంచి వరకు ఉన్న రోడ్-కమ్-బాక్స్ డ్రెయిన్‌ను, ఓయు కాలనీ--మర్రిచెట్టు రోడ్డుకు అనుసంధానం చేస్తూ ట్రాఫిక్ రాకపోకలకు వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అలాగే కనకదుర్గమ్మ ఆలయం ఎదురుగా ఉన్న రోడ్డును రోడ్ నంబర్ 10తో అనుసంధానించే రహదారిని కూడా తెరవాలని విజ్ఞప్తి చేశారు. రోడ్ నంబర్ 10లోని సంగీత్ కాంక్రీట్ అపార్ట్‌మెంట్స్ ఎదురుగా బుల్కాపూర్, షేక్‌పేట్, పాండెన్‌వాగు నాలాలు కలిసే ప్రాంతంలో తగిన చెక్‌డ్యామ్ నిర్మించాలని కోరారు. సహజ నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా నీటిని షేక్‌పేట్ నాలా వైపు మళ్లించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా సంగీత్ కాంక్రీట్ అపార్ట్‌మెంట్స్ ఎదురుగా ఉన్న ప్రాంతం నుంచి మల్కం చెరువు రోడ్డుకు అనుసంధానం కల్పించేలా, హెచ్‌టీ లైన్ల కింద బాక్స్ డ్రెయిన్‌పై కనెక్టింగ్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి వస్తే ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు అవకాశం ఉంటుందని స్థానికులు తెలిపారు. కాలనీలోని పలు రోడ్లలో యూజీడీ నెట్‌వర్క్‌ను అప్‌గ్రేడ్ చేసి బలోపేతం చేయాలని అధికారులను కోరారు. అదేవిధంగా పంచవటి కాలనీ ఈశాన్య వైపున నార్సింగి సర్కిల్ పరిధిలోని వార్డు నంబర్ 127 (మణికొండ), సెరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని వార్డు నంబర్ 105 (గచ్చిబౌలి) మధ్య ఏర్పడిన వార్డు సరిహద్దు సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. పంచవటి కాలనీలో పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీ, పార్కులు, యూజీడీ, ట్రాఫిక్ కనెక్టివిటీకి సంబంధించిన సమస్యలను ప్రాధాన్యతతో పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు అధికారులను కోరారు. అధికారులు కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించడం ద్వారా వాటి పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.



## గొల్లపల్లి సెక్టార్ పరిధిలో ఘనంగా జాతీయ పోషణ మాసోత్సవాలు -- సామూహిక శ్రీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలు...!

**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్)** జాతీయ పోషణ మాసంలో భాగంగా గొల్లపల్లి సెక్టార్ పరిధిలో సెక్టార్ స్థాయి పోషణ మాసం కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ నల్ల నీరజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**ఆరోగ్యం -- పౌష్టికాహారం పై అవగాహన:** ఈ సందర్భంగా సర్పంచ్ నల్ల నీరజ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు మరియు కిశోర బాలికలు రక్తహీనత (అనీమియా) బారిన పడకుండా ఉండేందుకు నిత్యం పోషకాలతో కూడిన మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి ఇంట్లో న్యూట్రి గార్డెన్ (పోషక పెరటి తోటలు) ఏర్పాటు చేసుకుని తాజా కూరగాయలు పెంచుకోవాలని కోరారు.అనంతరం అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు (సూపర్వైజర్) జానకి మాట్లాడుతూ.. మహిళల్లో రక్తహీనత సమస్య ఎక్కువగా కనిపించే అవకాశం ఉన్నందున తాజా ఆకుకూరలు, పాలు, పండ్లు, మొలకెత్తిన గింజలు, చిరుధాన్యాలు (మిల్లెట్స్) మరియు సమతులాహారం తప్పనిసరిగా తీసుకోవాలని వివరించారు.

**శ్రీమంతాలు మరియు అన్నప్రాసనలు:** కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు మరియు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను వేడుకగా నిర్వహించారు.

**పాల్గొన్న ప్రముఖులు:** ఈ కార్యక్రమంలో సర్పంచ్ నల్ల నీరజ సతీష్ రెడ్డి, పర్యవేక్షకురాలు జానకి, పంచాయతీ కార్యదర్శి మధు, ఉప సర్పంచ్ బుచ్చి రెడ్డి, సహాయ నిలయ వైద్యురాలు (ఏఎన్ఎమ్) రజిత, అంగన్‌వాడీ సెక్టార్ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, పాఠశాల పూర్వ విద్యా పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ కౌన్సిలర్ ఉషారాణి జన్మదిన వేడుకలు

గండిపేట(క్రైమ్ మిర్రర్): నార్సింగి సర్కిల్ పరిధిలోని నార్సింగి మాజీ కౌన్సిలర్ ఉషారాణి జన్మదినాన్ని పురస్కరించుకుని 17వ వార్డు మహిళలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషారాణితో కేక్ కట్ చేయించి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఉషారాణి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అనంతరం కేక్‌ను అందరికీ పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో 17వ వార్డుకు చెందిన పలువురు మహిళలు, స్థానికులు పాల్గొని మాజీ కౌన్సిలర్ ఉషారాణికి శుభాకాంక్షలు తెలిపారు.



# కళ్యాణ లక్ష్మికి 12 ఏళ్లు..

## కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం..పేదింటి ఆడబిడ్డలకు ఆర్థిక భరోసా కల్పించిన పథకం

## తులం బంగారం హామీని అమలు చేయాలని బీఆర్ఎస్ నేతల డిమాండ్

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, మాద్రి పృథ్వీరాజ్

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 03: పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రారంభించిన కళ్యాణ లక్ష్మి పథకానికి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పటాన్‌చెరులో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పటాన్‌చెరు పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కేసీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, మాద్రి పృథ్వీరాజ్, బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోనే తొలిసారిగా పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే కళ్యాణ లక్ష్మి పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. 2014 అక్టోబర్ 2న ప్రారంభమైన ఈ పథకం 2014 నుంచి 2023 వరకు లక్షలాది నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచిందన్నారు. పేదింటి ఆడబిడ్డలకు పెద్ద కొడుకులా, మేనమామలా కేసీఆర్ భరోసా కల్పించారని పేర్కొన్నారు. కళ్యాణ లక్ష్మి పథకం




ప్రారంభంలో రూ.51 వేలుగా ఉన్న ఆర్థిక సహాయాన్ని 2017లో రూ.75,116కు, 2018లో రూ.1,00,116కు పెంచినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా 12.71 లక్షల కుటుంబాలకు రూ.11,130 కోట్ల మేర ఆర్థిక సహాయం అందించినట్లు బీఆర్ఎస్ నాయకుడు మాద్రి పృథ్వీరాజ్ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కళ్యాణ లక్ష్మి పథకం కింద అందుతున్న ఆర్థిక సహాయానికి అదనంగా తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీ అమలుపై స్పష్టత లేదని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



విమర్శించారు. హామీ మేరకు తులం బంగారాన్ని అందించాలని, పేద కుటుంబాల ఆడబిడ్డలకు మరింత అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ విజయ్, సీనియర్ నాయకులు గూడెం మధు, శ్రీధర్ చారి, యాదగిరి యాదవ్, వెంకటేష్, నర్ర బిక్షపతి, ధనరాజ్ గౌడ్, గుండమొల్ల రాజు, పర్మేష్ యాదవ్, కాట రాజు గౌడ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు, ఎంఆర్‌పీఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు

## మిషన్ భగీరథ, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేయాలి

## గడ్డపోతారం మున్సిపల్ అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 03: ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సూచించారు. శనివారం పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్లు, జలమండలి, మిషన్ భగీరథ, విద్యుత్, గృహ నిర్మాణ శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలో రూ.75 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నీటి ఎద్దడి నివారణకు కౌన్సిల్ ఆమోదంతో అవసరమైన ప్రాంతాల్లో బోర్లు వేయాలని



సూచించారు. మిషన్ భగీరథ గ్రిడ్, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కోరారు. గ్రామీణ ప్రాంతాలు మున్సిపాలిటీలు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విలీనం కావడంతో ఏర్పడిన సమన్వయ లోపాలను అధిగమించి నీటి సమస్యలు తలెత్తకుండా రెండు శాఖల అధికారులు ఎప్పటికప్పుడు సమావేశమై చర్యలు తీసుకోవాలని సూచించారు. జానకంపేట, గండిగూడెం, దాయర బొమ్మనకుంట గ్రామాల పరిధిలో గత రెండేళ్లుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సుమారు రూ.10 లక్షలతో నూతన పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టి త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. గడ్డపోతారం మున్సిపాలిటీ అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మున్సిపాలిటీని అభివృద్ధిలో ముందంజలో నిలపాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక వనరుల సమీకరణలో భాగంగా పరిశ్రమల పన్నులను రివిజన్ చేయాలని అధికారులకు సూచించారు. ముత్తంగి డివిజన్ పరిధిలోని పోచారం, ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని లకడారంలో నిర్మాణం పూర్తయిన సబ్‌స్టేషన్లను అక్టోబర్ రెండో వారంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. మాదారం, ఘనాపూర్, కొల్లూరు, నాగులపల్లి ప్రాంతాల్లో నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలాలను కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, రెండు పడక గదుల ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటించాలని గృహ నిర్మాణ శాఖ పీడీ చలపతిరావును ఎమ్మెల్యే కోరారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి రాజకీయ జోక్యానికి తావులేదని స్పష్టం చేశారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హస్తాల ఈరన్నగుట్ట ఆలయ భూముల ఆక్రమణలపై ఆగ్రహం

## నాలుగు ఎకరాల దేవాలయ భూమిని కాపాడే వరకు పోరాటం కొనసాగిస్తాం.. ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

## అక్రమ నిర్మాణాల కూల్చివేతకు వచ్చిన అధికారులు వెనుదిరిగారని స్థానికుల ఆరోపణ..

## సీపీ సజ్జనార్‌తో ఎంపీ ఫోన్‌లో చర్చ

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** చింతల్‌మెట్, ఉప్పర్‌పల్లి పరిధిలోని హస్తాల వీరభద్రస్వామి (ఈరన్నగుట్ట) దేవస్థానానికి చెందిన భూములు, కోనేరు ఆక్రమణకు గురవుతున్నాయంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. దేవాలయానికి చెందిన సుమారు నాలుగు ఎకరాల భూమిని పరిరక్షించాలని కోరుతూ స్థానిక నాయకులు, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో నిరసన చేపట్టారు. స్థానికుల వివరాల ప్రకారం.. దేవాదాయ శాఖ అధికారులు గతంలో సర్వే నిర్వహించి, సదరు భూమి దేవస్థానానికి సంబంధించినదిగా పేర్కొంటూ నివేదిక, లేఖలు జారీ చేసినట్లు తెలిపారు. అయితే ఇటీవల ఆలయ భూముల పరిధిలో ప్రహరీ గోడతో పాటు ఇతర నిర్మాణాలు చేపడుతున్నారని, తద్వారా దేవస్థాన భూములు, కోనేరు ఆక్రమణకు గురయ్యే పరిస్థితి ఏర్పడిందని వారు ఆరోపించారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునేందుకు మున్సిపల్, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారని స్థానికులు తెలిపారు. అయితే కొందరు ప్రజాప్రతినిధులు అక్కడికి చేరుకుని అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో కూల్చివేత చర్యలు నిలిచిపోయాయని వారు ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అధికారులు వెనక్కి తగ్గారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఆలయ భూములు, కోనేరు పరిసరాల్లో



జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించిన అనంతరం ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేవాదాయ శాఖ, జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ శాఖల వద్ద భూమికి సంబంధించిన రికార్డులు, నివేదికలు ఉన్నప్పటికీ ఆక్రమణలపై చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఉన్నట్లు పేర్కొంటున్న ఆలయ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, పవిత్రమైన కోనేరు కూడా ఆక్రమణకు గురయ్యే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఆలయానికి చెందిన భూములను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. ఆలయ భూముల పరిరక్షణ కోసం న్యాయపరమైన, పరిపాలనా మార్గాల్లో పోరాటం కొనసాగిస్తామని స్థానిక నాయకులు, హిందూ బంధువులు తెలిపారు. నాలుగు ఎకరాల దేవస్థాన భూమిని కాపాడే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం



చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్‌గోపాల్‌గౌడ్, బొక్క బాల్‌రెడ్డి, వై. శ్రీధర్, తోకల శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, కొమరయ్య, మల్లేష్‌యాదవ్, నర్సింగ్‌యాదవ్, బాబురావు, విఠల్, కృష్ణగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, ఈశ్వర్‌గౌడ్, పవన్, ఇంద్రపాల్‌రెడ్డి, రాజు, నరేందర్, భూపాల్, మహేందర్‌గౌడ్, సురేష్‌గౌడ్, సందీప్, వెంకటేశ్, విజయ్‌తో పాటు చింతల్‌మెట్, ఉప్పర్‌పల్లి ప్రాంతాలకు చెందిన స్థానికులు, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గొల్లపల్లి మండలం ఇబ్రహీం నగర్ సెక్టార్ లోని ఇస్రాజ్ పల్లె అంగన్వాడీ కేంద్రాలలో పోషణ మాసం...!

**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** పోషణ మాసం కార్యక్రమాలను నిర్వహించుకోవడం జరిగింది కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ గోస్కుల జలంధర్ హాజరయ్యారు ఈ కార్యక్రమంలో తల్లులు స్థానికంగా లభించే ఆకుకూరలు కూరగాయలు పండ్లు తీసుకోవాలని ఐరన్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా రక్తహీనత బారిన పడకుండా ఉండవచ్చని తల్లులకు వివరించి చెప్పడం జరిగింది పిల్లలు చేరుకోవాల్సినమైలు స్టోన్స్ గురించి ఏ వయసులో ఏవిధంగా మైలు స్టోన్స్ చేరుకోవాలని తల్లులకు తెలియజేయడం జరిగిందిఈ కార్యక్రమంలో పిల్లలకు అక్షరాభ్యాసం అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు అంగన్వాడీ కేంద్రాలలో 6-3 సంవత్సరాల పిల్లలకు బాలామృతం పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ సూపర్వైజర్ జ్యోతి అంగన్వాడీ టీచర్లు పద్మ సత్య వార్డ్ సభ్యులు గర్భవతులు బాలింతలు ప్రీ స్కూల్ పిల్లల తల్లులు పాల్గొనడం జరిగింది.

## ఎలాంటి అనుమతులు లేకున్నా పాఠశాలలు నడుపుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

### బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

**మాడుగుల పల్లి (అక్టోబర్ 03)ప్రతినిధి :** వేలకు వేల రూపాయలు ఫీజులు దండుకుంటూ ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాలలు నడుపుతున్న యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ విద్యాశాఖ అధికారులను కోరారు.ఒక స్కూలుకు మాత్రమే అనుమతి తీసుకుని నాలుగైదు బ్రాంచీలు గ్రామర్ టెక్నో ఈ టెక్నో ఒలంపియాడ్ అనే పేరుతో విచ్చలవిడిగా పుట్టగొడుగుల వ్యాపిస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని హైదరాబాద్ లాంటి మహానగరంలో ఇలాంటి మోసాలు ఎక్కువ జరుగుతున్నాయని మండల విద్యాశాఖ అధికారులు మొద్దు నిద్ర విడనాడి కఠినంగా వ్యవహరించాలని లింగం గౌడ్ అన్నారు

## ఉద్యమకారుల సమస్యలపై గళం విప్పాలి

### దండేపల్లి సమావేశానికి తరలిరావాలని రామిడి కుమార్ పిలుపు

**మంచిర్యాల,అక్టోబర్ 4 :** తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు,వారి సమస్యల పరిష్కారంపై చర్చించేందుకు అక్టోబర్ 4న దండేపల్లి మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు మంచిర్యాల జిల్లా తెలంగాణ ఉద్యమకారుల సమితి అధ్యక్షుడు రామిడి కుమార్ తెలిపారు.ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బెల్లంపల్లి,చెన్నూర్,మంచిర్యాల నియోజకవర్గాలకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు సమావేశానికి హాజరై తమ సమస్యలు,అభిప్రాయాలను వెల్లడించాలని ఆయన కోరారు.ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలు,ఉద్యమకారుల సమస్యలు,వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశానికి తెలంగాణ ఉద్యమకారుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు తోడేటి శంకర్ గౌడ్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్,రాష్ట్ర కార్యదర్శి గోపతి రాజన్న ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.మూడు నియోజకవర్గాలకు చెందిన ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని రామిడి కుమార్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

## "కెకె కమిటీ" అంటే "కాలయాపన కమిటీ" కాకూడదు.!

### పాలిటెక్నిక్ విషయంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించాలి

### పాలిటెక్నిక్ జెఏసి రాష్ట్ర చైర్మన్, డిఎస్ఎఫ్ వ్యవస్థాపకులు ఎరవెల్లి జగన్ విజ్ఞప్తి

**కూకట్ పల్లి, అక్టోబర్ 03 :** పాలిటెక్నిక్ వ్యవస్థను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీ పరిధిలోకి చేర్చి శక్తి శాఖలో విలీనం చేయడానికై ప్రభుత్వం జారీచేసిన జీవో 97 రద్దు చేయాలని వీరోచితంగా పోరాడిన పాలిటెక్నిక్ వ్యవస్థ భాగస్వాములతో నెలరోజుల కాలవ్యవధిలో మూడుసార్లు చర్చలు జరిపిన కే కేశవరావు నేతృత్వంలోని హైలెవల్ కమిటీ ప్రభుత్వానికి రిపోర్టు సమర్పించి రెండు వారాలు పూర్తవుతున్నా నేటికీ సవరణ జీవో జారీ కాలేదని, కనీసం ప్రభుత్వం నుండి గానీ సంబంధిత అధికారుల నుండి గానీ హై లెవల్ కమిటీ సభ్యుల నుండి గానీ పాలిటెక్నిక్ వ్యవస్థకు సంబంధించి మరలా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదని తెలంగాణ పాలిటెక్నిక్ జెఏసి రాష్ట్ర ఛైర్మన్, డిఎస్ఎఫ్ వ్యవస్థాపకులు ఎరవెల్లి జగన్ ఆవేదన వ్యక్తం చేసారు. ఈ సందర్బంగా ఎరవెల్లి జగన్ మాట్లాడుతూ ఇకనైనా పాలిటెక్నిక్ వ్యవస్థ భవిష్యత్ సంబంధిత విషయం పట్ల ప్రభుత్వం స్పందించి అధికారికంగా స్పష్టమైన ప్రకటనను విడుదల చేయాలని కోరారు. కేకే కమిటీ అంటే కాలయాపన కమిటీ అనే అపవాదు రాకుండా చూడాలని, హై లెవల్ కమిటీ సమర్పించిన రిపోర్టును పాలిటెక్నిక్ వ్యవస్థ భాగస్వాములకు, రాష్ట్ర ప్రజలకు బహిర్గతం చేయాలని ఎరవెల్లి జగన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.

# మోటార్ సైకిళ్లే టార్గెట్....!

**ముగ్గురు బైక్ దొంగలు అరెస్ట్**

**రూ.3 లక్షల విలువైన 9 మోటార్ సైకిళ్లు స్వాధీనం.**

**వివరాలు వెల్లడించిన సీఐ చరమంద రాజు**



అరెస్టయిన నిందితులు.



**క్రైమ్ మిర్రర్, హుజూర్ నగర్ (గరిడేపల్లి):** హుజూర్ నగర్ నియోజక వర్గంలో గరిడేపల్లి మండల పోలీస్ స్టేషన్ పరిధిలో మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి సుమారు రూ.3 లక్షల విలువైన 9 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను హుజూర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చరమందరాజు గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

**కేసు వివరాలు**

తేదీ 29-09-2026 రాత్రి కలకోవా గ్రామానికి చెందిన మండవ శివశంకర్ తన టీఎస్ 05ఈఎ 1171 నంబర్ గల ఎచ్ ఎఫ్ డీలక్స్ మోటార్ సైకిల్‌పై కీతవారిగూడెం గ్రామంలోని తన మామ ఇంటికి వచ్చి, రాత్రి సమయంలో ఇంటి ముందు బైక్‌ను నిలిపి నిద్రించాడు. ఉదయం చూడగా గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌ను దొంగిలించినట్లు గుర్తించి గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు గరిడేపల్లి పోలీసులు సిఆర్ నెంబర్.188/2026, యూ/ఎస్ 305(బి) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా 03-10-2026 ఉదయం సుమారు 9:00 గంటలకు గరిడేపల్లి మండలంలోని కల్మల్చెరువు ఎక్స్ రోడ్ వద్ద ఎస్ఐ బి. శ్రీకాంత్ గౌడ్ , సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, ఇద్దరు యువకులు ఒక మోటార్ సైకిల్‌పై మిర్యాలగూడ వైపు వెళ్తూ పోలీసులను చూసి తప్పించుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా మోటార్ సైకిల్ దొంగతనాలకు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

**అరెస్టయిన నిందితులు.**

ఏ-1. తోకల మధు, వయస్సు: 22 సంవత్సరాలు, వృత్తి: కార్ మెకానిక్, నివాసం: గరిడేపల్లి గ్రామం, మండలం.

ఏ-2. కేమ ముగేష్ కుమార్, వయస్సు: 26 సంవత్సరాలు, వృత్తి: కూలీ, స్వస్థలం: గణేశపురం కాలనీ, మదతకులం గ్రామం ఓ మండలం, తిరుప్పూర్ జిల్లా, తమిళనాడు. ప్రస్తుతం గరిడేపల్లిలో నివాసం. ఏ-3. షేక్ జానీపాషా, వయస్సు: 23 సంవత్సరాలు, వృత్తి: బైక్ మెకానిక్, నివాసం: పొనుగోడు గ్రామం, గరిడేపల్లి మండలం.

**దొంగతనాల విధానం.**

పోలీసుల విచారణలో నిందితులు గతంలో కూడా మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడైంది. 2024లో మధు, ముగేష్ కుమార్ కలిసి కోదాడ పట్టణంలో ఒక సిబిజెడ్ మోటార్ సైకిల్‌ను దొంగిలించి వినియోగించినట్లు తెలిపారు. అనంతరం ఈ ఏడాది జూన్ నెల నుంచి మధు, ముగేష్ కుమార్, ఒక మైనర్ బాలుడు కలిసి సూర్యాపేట, మిర్యాలగూడ, దామరచర్ల, రామన్నపేట, నార్కట్‌పల్లి, కీతవారిగూడెం తదితర ప్రాంతాల్లో మోటార్ సైకిళ్లను దొంగిలించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దొంగిలించిన బైక్‌లలో 6 మోటార్ సైకిళ్లను జానీపాషాకు అప్పగించి, వాటిని మరమ్మతులు చేసి విక్రయించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. మరిన్ని మోటార్ సైకిళ్లు దొంగిలించి తీసుకురావాలని జానీపాషా నిందితులకు రూ.5,000 అడ్వాన్స్‌గా ఇచ్చినట్లు విచారణలో వెల్లడైంది. దొంగిలించిన మోటార్ సైకిళ్లను విక్రయించి, వచ్చిన డబ్బును అందరూ కలిసి పంచుకోవాలని నిందితులు పథకం వేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

**నిందితుల పట్టివేత..**

03-10-2026 ఉదయం మధు, ముగేష్ కుమార్ ఇద్దరూ కీతవారిగూడెం గ్రామంలో దొంగిలించిన ఒక మోటార్ సైకిల్‌ను పొనుగోడు గ్రామంలో విక్రయించేందుకు ప్రయత్నించారు. అయితే కొనుగోలుదారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆ బైక్‌ను మధు కార్ షెడ్‌లో దాచేందుకు తీసుకెళ్తుండగా కల్మల్ చెరువు ఎక్స్ రోడ్ వద్ద పోలీసుల వాహన తనిఖీల్లో పట్టుబడ్డారు. వారి విచారణ ఆధారంగా ఇతర దొంగతనాలకు సంబంధించిన వివరాలను పోలీసులు సేకరించి, జానీపాషాను కూడా అదుపులోకి తీసుకున్నారు. కేసులో మరింత దర్యాప్తు కొనసాగుతున్నది. దొంగతనాలకు సంబంధించిన ఇతర వివరాలు, వాహనాల యజమానులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

**ప్రజలకు పోలీసుల సూచన**

ప్రజలు తమ వాహనాలను సురక్షితంగా పార్క్ చేసుకోవాలని, వాహనాలకు తప్పనిసరిగా లాక్ వేసుకోవడంతో పాటు వీలైనంత వరకు సీసీ కెమెరాల పరిధిలో నిలిపి ఉంచాలని పోలీసులు సూచించారు. పోలీసుల అప్రమత్తతతో మోటార్ సైకిల్ దొంగతనాల కేసులో నిందితులను త్వరితగతిన గుర్తించి అరెస్ట్ చేయడంలో సహకరించిన గరిడేపల్లి పోలీస్ సిబ్బందిని అధికారులు అభినందించారు.ఈ సమావేశంలో గరిడేపల్లి ఎస్ఐ బి. శ్రీకాంత్ గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏంటి..? ఏఐ ఇప్పుడు వైరస్‌లను కూడా రూపొందిస్తోందా?



ఏఐతో ఇప్పటిదాకా చిత్రాలను, చిన్నచిన్న వీడియోలను తయారు చేయడం మనకు తెలుసు... కొందరు కోడింగ్ కోసం ప్రాంప్ట్ ఇస్తారు. ప్రాజెక్టు పనులకు కోసం వివరాలు వెతుకుతారు, మరికొందరు కొత్త రకం సినిమా కథలను తయారు చేయడం, సంగీతాన్ని సృష్టించడం కోసం ఏఐని వాడుతున్నారు. అయితే, తాజా పరిశోధనల ఫలితంగా జీవుల జన్యు నిర్మాణాన్ని కూడా రూపొందించే దిశగా కృత్రిమ మేధా అడుగులు వేస్తోంది. అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ, ఆర్క్ సంస్థ పరిశోధకులు కృత్రిమ మేధస్సును ఉపయోగించి ప్రకృతిలో ఇంతకు ముందు లేని 16 కొత్త వైరస్‌లను రూపొందించారు. వీటితో మానవాళికి ప్రమాదం లేదు. ఎందుకంటే ఇవి మనుషులకు సోకేవి కావు. మనుషులను బాధించే బ్యాక్టీరియాను నాశనం చేసే వైరస్. మందులకు లొంగని బ్యాక్టీరియాని ఈ తరహా వైరస్‌లతో ఎదుర్కోవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అయితే ఈ ప్రయత్నం ప్రయోగశాలలోనే ఉంది. ఏఐతో రూపొందించిన వైరస్ తయారై మార్కెట్లోకి రావాలంటే మరి కొన్నేళ్లు ఆగాల్సిందే.

# రైల్వే కొత్త రూల్.. ఇక రూ.1,000 ఫైన్!



**దేశంలో నిత్యం కోట్లాది మంది ప్రయాణించే రైళ్లలో ఎక్కువ మందికి ఏదైనా అసౌకర్యం ఉందంటే అది అపరిశుభ్రతే. ఈ దురవస్థను కాస్తయినా తగ్గించేందుకు భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రైల్వే స్టేషన్లు, ప్లాట్‌ఫారాలు, రైళ్లలో చెత్త వేయడం, ఉమ్మడం వంటి పనులు చేసేవారిని కట్టడి చేసేందుకు పరిశుభ్రత నిబంధనలను ఉల్లంఘించే వారికి విధించే జరిమానాను ఏకంగా రెట్టింపు చేసింది.**

ఇప్పటివరకు గరిష్ఠంగా రూ.500గా ఉన్న జరిమానాను రూ.1,000కు పెంచుతూ కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. కొత్త నిబంధనల ప్రకారం రైల్వే ప్రాంగణాలు, ప్లాట్‌ఫారాలు లేదా రైలు బోగీల్లో నిర్దేశిత ప్రదేశాలు మినహా ఎక్కడపడితే అక్కడ చెత్తను విసరడం, పడేయడం లేదా వదిలిపెట్టడం నిషేధం. ఇలాంటి ఉల్లంఘనలకు రూ.1,000 జరిమానా విధించవచ్చు. కేవలం చెత్త వేయడమే కాదు.. రైల్వే ప్రాంగణాల్లో పరిశుభ్రతకు భంగం కలిగించే మరికొన్ని చర్యలపైనా నిబంధనలు వర్తిస్తాయి.

**చెత్త వేయడమే కాదు.. వీటిపైనా నిఘా**

నిబంధనల ప్రకారం.. రైల్వే ప్రాంగణాల్లో అనుమతించిన సదుపాయాలు మినహా వంట చేయడం, స్నానం చేయడం, ఉమ్మివేయడం, మూత్ర విసర్జన, మలవిసర్జన, జంతువులు లేదా పక్షులకు ఆహారం వేయడం వంటి చర్యలు కూడా నిషేధం. అలాగే వాహనాలు, పాత్రలు, లేదా ఇతర వస్తువులను కడగడం, బట్టలు ఉతకడం, రైల్వే ప్రాంగణంలో వస్తువులను నిల్వ చేయడం కూడా నిబంధనలకు విరుద్ధమే.అదేవిధంగా, రైల్వే అధికారుల అనుమతి లేకుండా పోస్టర్లు అంటించడం, రైలు బోగీలు లేదా రైల్వే ఆస్తులపై రాయడం, గీయడం, వాటిని ధ్వంసం చేయడం కూడా చర్యలకు దారితీయవచ్చు. 2012లో రూపొందించిన ఈ నిబంధనల్లో గతంలో గరిష్ఠ జరిమానా రూ.500గా ఉండేది. తాజా సవరణతో ఆ మొత్తాన్ని రూ.1,000కు పెంచారు.

**ఫైన్ కట్టకపోతే ఏం జరుగుతుంది?**

కొత్త నిబంధనల్లో మరో కీలక అంశం ఉంది. విధించిన రూ.1,000 జరిమానాను చెల్లించకపోతే, సంబంధిత వ్యక్తిని అధికార పరిధి ఉన్న కోర్టు ముందు హాజరుపరచవచ్చు. అక్కడ రూ.2,000 వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది.

**జరిమానా ఎవరు వసూలు చేస్తారు?**

నిబంధనల ప్రకారం స్టేషన్ మాస్టర్ లేదా స్టేషన్ మేనేజర్, కమర్షియల్ విభాగానికి చెందిన టికెట్ కలెక్టర్ స్థాయి లేదా అంతకంటే పైస్థాయి అధికారులు, ఆపరేటింగ్ విభాగంలో సమాన హోదా కలిగిన అధికారులు, అలాగే రైల్వే పరిపాలన ప్రత్యేకంగా అధికారం ఇచ్చిన ఇతర అధికారులు జరిమానా వసూలు చేయవచ్చు.

# గూగుల్‌తో విప్రో బిగ్ ప్లాన్

**10 వేల మంది ఏఐ స్పెషలిస్టుల సిద్ధం!**




కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా గ్లోబల్ ఐటీ దిగ్గజం విప్రో సంచలన నిర్ణయం తీసుకుంది. గూగుల్ క్లౌడ్ టెక్నాలజీ ఆధారంగా ప్రపంచవ్యాప్తంగా వివిధ వ్యాపార సంస్థలకు అత్యాధునిక సేవలందించేందుకు ఏకంగా 10,000 మంది ఏఐ సర్టిఫైడ్ స్పెషలిస్టులను తయారు చేయాలని నిర్ణయించింది. గూగుల్ మల్టీమోడల్ ఏఐ మోడల్ 'జెమినీ' ఆధారిత సొల్యూషన్స్‌ను రూపొందించడమే లక్ష్యంగా ఈ భారీ మానవ వనరుల శిక్షణ కార్యక్రమాన్ని చేపడుతోంది.ఈ బృందంలో ప్రత్యేకంగా 1,500 మంది ఫార్వర్డ్ డిప్లాయ్డ్ ఇంజినీర్లు ఉంటారు. వీరు నేరుగా క్లయింట్ ఆఫీస్ ప్రాంగణాల్లోనే (ఆన్-సైట్) అందుబాటులో ఉంటూ సాంకేతిక సవాళ్లను తక్షణమే పరిష్కరించడంతో పాటు వ్యాపార ప్రక్రియల డిజిటలైజేషన్‌లో కీలక పాత్ర పోషిస్తారు. విప్రో సొంత ఏఐ ప్లాట్‌ఫామ్ 'విప్రో ఇంటెలిజెన్స్'కు గూగుల్ జెమినీ శక్తిని జత చేయడం ద్వారా క్లయింట్ కంపెనీలు తమ ఉత్పాదకతను, పనితీరును గణనీయంగా పెంచుకోగలవని విప్రో లిమిటెడ్ మేనేజింగ్ పార్ట్‌నర్ కన్వర్ సింగ్ వెల్లడించారు. జనరేటివ్ ఏఐ సేవలకు మార్కెట్లో పెరుగుతున్న డిమాండ్‌ను అందుకోవడానికి ఈ వ్యూహాత్మక అడుగు ఎంతో దోహదపడుతుందని ఐటీ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# ట్రేడ్ డీల్స్.. మరిన్ని దేశాలతో ఎఫ్‌టీఏ

**8--9 దేశాలతో చర్చలు షురూ**

**కేంద్ర మంత్రి గోయల్ వెల్లడి**



ఉమ్మడిగా సుమారు 15 లక్షల కోట్ల డాలర్ల విలువైన 8--9 దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ)పై చర్చలు నిర్వహిస్తున్నట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ తాజాగా పేర్కొన్నారు. తద్వారా ప్రపంచ వాణిజ్యంలో దాదాపు 75 శాతానికి సమానమైన ఎఫ్‌టీఏలకు వీలున్నట్లు తెలియజేశారు. ఇది గ్లోబల్ ట్రేడ్ వేల్యూ చైన్‌లో ఇండియా విశ్వసించదగిన భాగస్వామిగా అవతరించేందుకు వీలు కల్పించనున్నట్లు వెల్లడించారు.గత నాలుగేళ్లలో 9 ఎఫ్‌టీఏలు కుదుర్చుకోవడం ద్వారా దేశీయంగా భారీ మార్కెట్ కలిగి ఉన్న భారత్.. ప్రపంచానికి ద్వారాలు తెరిచిందని పేర్కొన్నారు. ఈ 9 ఎఫ్‌టీఏల ద్వారా 38 అభివృద్ధి చెందిన దేశాలతోపాటు.. ఉమ్మడిగా 60 లక్షల కోట్ల డాలర్ల విలువైన జీడీపీని కవర్ చేస్తున్నట్లు వివరించారు. భారత్, జపాన్ వ్యాపార ప్రతినిధులతో ఏర్పాటు చేసిన వేదికపై గోయల్ ఇంకా పలు అంశాలపై ప్రసంగించారు. దేశీయంగా జపనీస్ దిగ్గజాల పెట్టుబడులకు ఆహ్వానం పలుకుతూ గోయల్ 200 మంది వ్యాపార ప్రతినిధులతో ఇక్కడ పర్యటిస్తున్నారు. దేశీయంగా డేటా సెంటర్లు, తయారీ, ఏఐ తదితర రంగాలలో పెట్టుబడులకు భారీ అవకాశాలున్నట్లు ప్రస్తావించారు.ఆర్థిక ఒప్పందాలు రెండు దేశాల మధ్య సమతూక వాణిజ్యానికి దారి చూపుతాయని అభిప్రాయపడ్డారు. దేశీయంగా అంతరిక్ష రంగంలో అత్యధిక అవకాశాలున్నాయని, ఇందుకు ప్రయివేట్ పెట్టుబడులకు వీలుగా తలుపులు తెరిచామని తెలియజేశారు. దేశీయంగా అభివృద్ధి చేస్తున్న 20 పారిశ్రామిక స్మార్ట్ నగరాలలో యూనిట్లను ఏర్పాటు చేయవలసిందిగా జపనీస్ దిగ్గజాలకు ఆహ్వానం పలికారు.

# భారత్‌లో చాట్‌జీపీటీలో ప్రకటనలు



కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో సరికొత్త విప్లవం సృష్టించిన ఓపెన్ ఏఐ భారతదేశంలో తన రాబడి మార్గాలను విస్తరించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని చాట్‌జీపీటీ ఫ్రీ, నెలకు రూ.399 చెల్లించే 'గో' ప్లాన్ వినియోగదారులకు సంభాషణల్లో స్పాన్సర్డ్ ప్రకటనలు (యాడ్స్) చూపించడం ప్రారంభించినట్లు సంస్థ అధికారికంగా వెల్లడించింది. అయితే, ప్లస్, ప్రో, బిజినెస్, ఎంటర్‌ప్రైజ్, ఎడ్యుకేషన్ వంటి పెయిడ్ చందాదారులకు ఎటువంటి యాడ్స్ ఉండవని స్పష్టం చేసింది.

**వినియోగదారుల డేటా భద్రత**

ప్రకటనల వల్ల వినియోగదారుల అనుభవానికి భంగం కలగకుండా ఓపెన్ ఏఐ కఠినమైన నిబంధనలను విధిస్తున్నట్లు చెప్పింది. కంపెనీ తెలిపిన వివరాల ప్రకారం.. వినియోగదారులు అడిగే ప్రశ్నలకు ఏఐ ఇచ్చే సమాధానాలపై ఈ ప్రకటనలు ఎలాంటి ప్రభావం చూపవు. ప్రతి సమాధానం కింద 'స్పాన్సర్డ్' అని స్పష్టమైన లేబుల్‌తో యాడ్స్ ప్రత్యేకంగా కనిపిస్తాయి. ప్రకటనకర్తలకు వినియోగదారుల చాట్ హిస్టరీ, వ్యక్తిగత వివరాలు లేదా 'మెమొరీస్' పొందే అవకాశం ఉండదు. కేవలం ఇంప్రెషన్లు, క్లిక్‌ల వంటి విశ్లేషణల సమాచారం మాత్రమే పొందుపరుస్తారు.

**నియంత్రణలు**

18 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్నవారికి ప్రకటనలు కనిపించవు. అలాగే ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, రాజకీయం వంటి సున్నితమైన అంశాల చర్చల సమయంలో ప్రకటనలు ప్రదర్శించబడవు. సుమారు 330 మిలియన్ల నెలవారీ క్రియాశీల వినియోగదారులు ఉన్న ఇండియా ఓపెన్ ఏఐకి అతిపెద్ద మార్కెట్లలో ఒకటి. స్థానిక వ్యాపారాలను ప్రోత్సహించేందుకు సెప్టెంబర్ 4 నుంచి 'చాట్‌జీపీటీ యాడ్స్ మేనేజర్' ద్వారా రోజుకు రూ.725 ప్రారంభ బడ్జెట్‌తో వ్యాపార ప్రకటనలు ఇచ్చుకునే వెసులుబాటును కల్పిస్తోంది. మొదటి దశలో డబ్ల్యూపీపీ, ఓమ్నికామ్ ఏజెన్సీలతో భాగస్వామ్యం కుదుర్చుకోగా మొదటి వారంలోనే 50కి పైగా ప్రముఖ బ్రాండ్లు ప్రకటనలు ఇవ్వడానికి సిద్ధమయ్యాయని కంపెనీ తెలిపింది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.